ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
శనివారం 3 మే 2025



నాయుడుపేట-రేణిగుంట ఆరు వరుసల జాతీయ రహదారి

తిరుపతికి 2 గంటలే!

నెల్లూరు, (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని నాయుడుపేట-రేణిగుంట రహదారికి ఎట్టకేలకు మోక్షం లభించింది. అనేక ఏళ్లుగా ఈ రోడ్డును విస్తరించాలని నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రజలు చేసిన విన్నపాలకు ఫలితం దక్కింది.

నాయుడుపేట-రేణిగుంట హైవే ప్రారంభం

నాయుడుపేట నుంచి రేణిగుంట వరకూ 6 వరుసల రహదారిని ప్రధాని మోదీ శుక్రవారం అమరావతి నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. 58.58 కిలోమీటర్ల దూరం అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన ఈ రహదారికి రూ.2,510 కోట్లు ఖర్చు చేశారు. ఇటు చెన్నై-కోల్‌కతా హైవే నుంచి అటు పుత్తూరు హైవేకు నూతనంగా నిర్మించిన రోడ్డు కనెక్టివిటీగా మారుతోంది. గతంలో రెండు వరుసల రహదారి ఉండగా వాహనదారులు నరకం చూసేశారు. ఇప్పుడు ఆరు వరుసల రహదారిని అన్ని గ్రామాలకు అనుసంధానం చేస్తూ ప్రతి గ్రామం వద్ద సర్వీసు రోడ్డు నిర్మించారు. మూడు రోడ్ ఓవర్ బ్రిడ్జీలు, ఐదు వెహికల్ అండర్‌పాస్‌లు, ఏడు ఫ్లైఓవర్‌లు, 15 వంతెనల నిర్మాణం పూర్తి చేశారు. నెల్లూరు నుంచి తిరుపతి, బెంగుళూరు ప్రాంతాలకు వెళ్లే జిల్లా వాసులకు ట్రాఫిక్ తిప్పలు తప్పనున్నాయి. మొన్నటిదాకా నాయుడుపేట నుంచి రేణిగుంటకు రెండు గంటల సమయం పడుతుండగా ఇప్పుడు 45 నిమిషాల్లోనే గమ్యం చేరవచ్చు.





ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించిన 167-బీజీ జాతీయ రహదారి

పల్లె ప్రగతికి.. హైవే!

ఎన్నో ఏళ్ల మెట్టవాసుల స్వప్నం సాకారమైంది. దుత్తలూరు నుంచి ఉదయగిరి మీదుగా సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల పొడవున రూ. 360 కోట్ల వ్యయంతో జాతీయ రహదారి (167-బీజీ) రహదారి నిర్మాణం పూర్తయ్యింది. దీంతో శుక్రవారం అమరావతిలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల వర్చువల్ విధానంలో జాతీయ రహదారిని ప్రారంభించడంతో పల్లెవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి) : రహదారుల నిర్మాణం అభివృద్ధికి మార్గాలు. రాకపోకలతోపాటు వృత్తి, వ్యాపారాల అభివృద్ధికి అవి ఎంతగానో దోహదపడతాయి. అందుకు ఉదాహరణే 167-బీజీ హైవే నిర్మాణం. ఈ రహదారి నిర్మాణంతో మెట్ట భూములు ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో రహదారికి సమీపంలో ఉన్న భూమి ఎకరం రూ.5 లక్షల నుంచి 7 లక్షలు పలికేది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో ప్రాంతాన్ని బట్టి రూ.25 లక్షల నుంచి 35 లక్షలకు చేరింది. దీంతోపాటు మోకాలిలోతు మార్జిన్లు, సింగిల్‌రోడ్డుతో అవస్థలు ఈ ప్రాంత ప్రజలకు జాతీయ రహదారి నిర్మాణంతో ప్రయాణానికి ఎంతో అనువుగా మారింది.

మెట్టకు మణిహారం.. 167-బీజీ హైవే

వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని, సీఎం

● 14 నెలల్లో పనులు పూర్తి

167-బీజీ రహదారి పనులు దక్కించుకున్న ఆర్‌కే-ఎంఆర్‌జీఆర్ సంస్థలు 18 నెలల్లో రహదారి పనులు పూర్తి చేయాల్సి ఉండగా 14 నెలల్లోనే పూర్తి చేశారు. ఇందుకుగాను ప్రభుత్వం రూ.360 కోట్లు మంజూరు చేయగా అందులో రోడ్డు నిర్మాణంలో కోల్పోయిన భూములు, నివాసులకు సుమారు రూ.100 కోట్ల పరిహారం చెల్లించారు. దుత్తలూరు సెంటర్‌లో 565 జాతీయ రహదారి మీదుగా ఫ్లైఓవర్ నిర్మాణంతోపాటు వాగులు, వంకలపైనా వంతెనల నిర్మాణం చేపట్టారు. బసినేనిపల్లి సమీపంలో టోల్‌గేట్ ఏర్పాటు చేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం చేయడంతో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లా వాసులకు ప్రయాణ కష్టాలు తీరాయి.



పునర్నిర్మాణోత్సవం.. చూసొద్దాం!

రాష్ట్ర రాజధాని అమరావతి పునఃనిర్మాణం పనులకు శుక్రవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమాన్ని కనులారా వీక్షించేందుకు జిల్లా నుంచి కూటమి నేతలతోపాటు అభిమానులు భారీగా తరలివెళ్లారు. అమరావతిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు తండోపతండాలుగా తరలివెళ్లాయి. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మనుబోలు, కావలి, వెంకటాచలం, ఉదయగిరి తదితర ప్రాంతాల నుంచి బస్సులు, వ్యాన్లలో నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు.

సోమశిల నుంచి డెల్టాకు నీరు విడుదల

అనంతసాగరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసుల తాగునీటి అవసరాల కోసం సోమశిల జలాశయం నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారు. డ్యాంలోని 6వ నెంబరు క్రస్ట్‌గేటు ద్వారా డెల్టా ప్రాంతానికి 1,000 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కాగా జలాశయంలో 51.114 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● రాళ్లపాడు నుంచి..

లింగసముద్రం : పత్తి సాగు కోసం రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, మధుసూదనరావు, ఏఈ జి చంద్రమౌళిలు తమ సిబ్బంది ద్వారా కుడి కాలువకు 60 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 8 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని డీఈ వెంకటేశ్వర్లు రైతులను కోరారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు.



సోమశిల నుంచి డెల్టా ప్రాంతానికి విడుదలైన నీరు

గ్రామీణ బ్యాంకుల విలీనం

● ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్పు

ఉదయగిరి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల ప్రజలకు ఏళ్ల తరబడి సుపరిచితమైన గ్రామీణ బ్యాంకులు విలీనం అయ్యాయి. ఆంధ్రప్రగతి గ్రామీణ, వికాస్, సప్తగిరి గ్రామీణ, చైతన్య గోదావరి బ్యాంకులు ఇకపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చుకుని ఖాతాదారులకు సేవలు అందించనున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలోని 86 ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు కూడా అదే తరహాలో ఖాతాదారులకు సేవలు అందిస్తాయి. మొట్టమొదటగా 1976లో గ్రామీణ ప్రజలకు అందుబాటు ఉండేలా పినాకిని గ్రామీణ బ్యాంకు ప్రారంభమైంది. కాలక్రమేణా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చుకొని ఏళ్ల తరబడి సేవలు అందిస్తూ వచ్చేది. ప్రస్తుతం ఆ బ్యాంకు ముచ్చటగా మూడవసారి పేరు మార్చుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు చెందింది. కాగా ఖాతాదారులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా, యథావిధిగా సేవలు పొందాలని అధికారులు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● 16 రహదారుల అభివృద్ధికి రూ.24.72 కోట్లు

● 38.87 కి.మీ కొత్త రోడ్లకు అనుమతులు

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధానమైన లింకు రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఆర్‌ఐడీఎఫ్) కింద ఈ రోడ్లను బాగు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 557.22 కోట్లతో 402 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 16 రోడ్లు అభివృద్ధి కానున్నాయి. 38.87 కిలోమీటర్ల మేర కొత్తగా బీటీ రోడ్డు నిర్మించనున్నారు. ఇందుకుగానూ రూ.24.72 కోట్లను కేటాయించారు. కొన్ని ప్రధానమైన లింకు రోడ్లు చాలా కాలం క్రితం వేసినవి కావడంతో దెబ్బతిన్నాయి. గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఇటువంటి వాటిని గుర్తించిన పంచాయతీరాజ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ వివరాలు పంపారు. ఈ క్రమంలో ఆర్‌ఐడీఎఫ్ నిధులతో ఈ ఏడాది చేపట్టనున్న రోడ్ల జాబితాలో 16 రోడ్లు చోటు దక్కించుకున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెలలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ అశోక్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులతో జిల్లాలో 16 ప్రధానమైన రోడ్లను పునఃనిర్మించనున్నట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియకు సంబంధించి శనివారం ప్రకటన విడుదల చేస్తామని, ఆ వెంటనే ఎస్టిమేషన్లు పూర్తి చేసి టెండర్లు పూర్తి చేస్తామని వివరించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (హరనాథపురం) మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పీబీకే పరిమళ ప్రకటనలో కోరారు. గురుకులాల్లో 3, 4వ తరగతి నుంచి 9వతరగతి వరకు 192 సీట్లు మిగిలి ఉన్నట్లు తెలిపారు. కొడవలూరు, కావలి, సర్వేపల్లి, బీఆర్‌పాలెం, ఇందుకూరుపేట, కరేడు, నెల్లూరు, రాపూరులలో ఈ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 30న ఐటీడీఏ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా సీట్ల భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

ఆహ్లాదానికి 'గ్రామ పుష్కరిణి'

- గ్రామాల్లో చెరువుల అభివృద్ధికి సరికొత్త పథకం
- తొలుత 5 ఎకరాల్లోపు చెరువుల అభివృద్ధి
- ముందుగా ఒక్కో మండలంలో ఒకటి ఎంపిక
- గ్రామస్థులకు ఆహ్లాదకరంగా ఉండేలా రూపకల్పన
- బిల్లుల మంజూరుతో 'గ్రామ కొలనులకూ' ఊతం



కలిగిరిలో నత్తనడకన..

కలిగిరి పెద్దచెరువును 'గ్రామకొలను'కు ఎంపిక చేశారు. రూ.2.15 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రతిపాదించగా రూ.50లక్షలతో మట్టిపనులు పూర్తవడంతో బిల్లులు చెల్లించారు. మరో రూ.15 లక్షలతో అలుగు రివిట్‌మెంట్ పనులు జరగ్గా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. నత్తనడకన పనులు జరుగుతుండటంతో కట్టచుట్టూ వేసిన మట్టి ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. పనుల జాప్యంపై అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

- కలిగిరి, (ఆంధ్రజ్యోతి)

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచి ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త పథకాన్ని తీసుకొచ్చింది. 'గ్రామ పుష్కరిణి' పేరుతో చెరువులను ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు జిల్లా అధికారులకు అందాయి. తొలి విడతగా ఐదెకరాల్లోపు ఉన్న చెరువులను బాగు చేయనున్నారు. ఈ చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తారు. చెరువు లోపలకు వెళ్లేందుకు వీలుగా ఘాట్ నిర్మిస్తారు. అవసరమైన చోట కూర్చునేందుకు వీలుగా బెంచీలు కూడా ఏర్పాటు చేస్తారు. మొదటగా ఒక్కో మండలంలో ఒక చెరువును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 37 గ్రామీణ మండలాలు ఉండగా వీటిలో 37 చెరువులు ఆహ్లాదకరంగా రూపుదిద్దుకోనున్నాయి. కాగా ప్రస్తుతం అభివృద్ధి చేయాల్సిన చెరువులను గుర్తిస్తున్నట్లు డ్వామా పీడీ గంగా భవానీ చెప్పారు.



రాపూరు చెరువు కట్టపై పూర్తయిన ట్రాక్

● గ్రామ కొలనులకు ఊతం

2022లో అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు 'గ్రామ కొలనుల' పేరుతో జిల్లాలోని కీలకమైన చెరువులను బాగు చేయాలని సంకల్పించారు. ఈ పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టారు. చెరువు కట్టలను పటిష్ట పరిచి ట్రాక్ ఏర్పాటు చేయడం ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలో 47 చెరువులను రూ.64.37 కోట్లతో అభివృద్ధి చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. అయితే కొన్ని చెరువుల పనులు ప్రారంభం కాలేదు. వీటిని రద్దు చేశారు. మరికొన్ని చెరువుల్లో కొంత పనులు జరిగాయి. ఉదయగిరి చెరువుకు రూ.6.50 కోట్లు ఖర్చు చేశారు .రాపూరు చెరువు పనులను రూ.1.05 కోట్లతో మొదలుపెట్టగా 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఈ విధంగా మిగిలిన చెరువుల్లో కూడా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అయితే వైసీపీ హయాంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఇటీవల గ్రామ కొలనుల పనులకు బిల్లులు మంజూరవుతున్నాయి. దీంతో మళ్లీ పనులు ఊపందుకోనున్నాయి. ప్రస్తుతం ఇరిగేషన్, డ్వామా అధికారులు పనులు మొదలుపెట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



'గ్రామ కొలను'లో ఎంపికై పనులు జరగని సంగం ఎర్రచెరువు



'గ్రామకొలను'లో భాగంగా చేపట్టిన పనులు నాసిరకంగా జరగడంతో దెబ్బతిన్న తూర్పుఎర్రబల్లి (గ్రామకొలను) చెరువుకట్ట

వెరిఫికేషన్ సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (సాంస్కృతికం) : జిల్లాలోని తూనికలు, కొలతల పరికరాలు వెరిఫికేషన్ సర్టిఫికెట్ కోసం వినియోగదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ పారిశ్రామిక వెబ్‌సైట్‌లోని సింగిల్ డెస్క్ పోర్టల్‌లో దరఖాస్తుదారులు నమోదు చేసుకోవాలని సూచించారు. పాన్‌కార్డు, ఆధార్ కార్డు వంటి అవసరమైన వివరాలు అందించాలని తెలిపారు. తూకం వేసే పరికరాలు, కొలతలు వేసే పరికరాలను లీగల్ మెట్రాలజీ అధికారి భౌతికంగా చూసి స్టాంప్ వేస్తారని వివరించారు.

తొలిరోజే 'విద్యార్థి మిత్ర'

● పాఠశాలల ప్రారంభం నాడే పిల్లలకు కిట్లు అందజేత

● జిల్లాకు చేరిన విద్యాసామగ్రి

నెల్లూరు (విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరం (2025-26) లో పాఠశాల ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఏకరూప దుస్తులతోపాటు విద్యా సామగ్రి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడు తోంది. జిల్లాలోని పాఠశాలలకు అవసర మైన సామగ్రిని భద్రపరిచేందుకు ప్రత్యేక కేంద్రా లను ఏర్పాటు చేయడంతోపాటు జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేక పర్యవేక్షణలో అన్నీ తరగతులకు 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో విద్యాసామగ్రి పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు.



జిల్లాకు చేరిన విద్యార్థి మిత్ర కిట్లు


● కమిటీల ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్న లక్ష్యంతో సమగ్రశిక్ష ద్వారా అధికారులతో మండల, జిల్లాస్థాయి కమిటీలను నియమించారు. నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్‌బ్యాగు, 3 జతల యూనిఫాం క్లాత్, బెల్టు, ఒక జత షూ, రెండుజతల సాక్సులు, డిక్షనరీ, వర్క్‌బుక్స్ అందజేయనున్నారు. ఈ కిట్ల ప్రకారం జిల్లాకు 1,61,959 స్కూలు బ్యాగులు, 1,15,480 బెల్టులు, 1,61,959 యూనిఫాంలు, 1,64,721 షూలు, 8,74,740 నోటుపుస్తకాలు, 1,30,870 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు జిల్లాకు ఇప్పటికే కొన్ని చేరిపోగా, మిగిలినవి కూడా చేరుతున్నాయి.

● ప్రత్యేక పర్యవేక్షణ

ప్రతి విద్యార్థికి విద్యాకిట్లు అందేలా ప్రత్యేక పర్యవేక్షణకు కమిటీలు ఏర్పాట య్యాయి. జిల్లాస్థాయి కమిటీలో హెడ్‌గా సమగ్రశిక్ష ఏపీసీ వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా సీఎంవో, సభ్యులుగా జీసీడీవో, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ నియమితులయ్యారు. వీరంతా జిల్లా, మండల స్థాయిల్లో స్టాక్ పాయింట్లను గుర్తించి వచ్చిన వస్తువుల నాణ్యతను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. అలాగే మండ లస్థాయి కమిటీలో హెడ్‌గా ఎంఈవో, సభ్యులుగా నలుగురు ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్‌ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్‌లు పనిచేస్తూ కిట్లను మండలస్టాక్ పాయింట్లలో భద్రపరిచి స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారు. ట్రాన్స్‌పోర్టు ద్వారా పాఠశాలలకు కిట్లు చేరవేస్తారు. అనంతరం ఎంఈవో బయోమెట్రిక్ విధానం ద్వారా కిట్లను అందచేస్తారు. అలాగే పాఠశాల కమిటీలో ప్రధానోపాధ్యాయులు, గ్రామసచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళా పోలీస్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సమక్షంలో విద్యార్థి కిట్లు పంపిణీ చేయాలి. విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించి రోజువారి రిపోర్టులను ఎంఈవో, ఇతర అధికారులకు పంపుతారు.

అందరికీ అందజేస్తాం



పాఠశాల ప్రారంభమైన తొలిరోజే ప్రతి విద్యార్థికి కచ్చితంగా విద్యామిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. వీటికోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు విద్యార్థి పూర్తి వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు ఒక్క విద్యార్థికి కూడా పెండింగ్ లేకుండా అందిస్తాం. జిల్లాకు వస్తున్న కిట్లలో ఒక్కటి కూడా తగ్గకుండా చూసుకుంటూ, నాణ్యతను పరిశీలించి స్టాక్ పాయింట్లలో భద్రపరుస్తున్నాం. పాఠశాలల వారీగా విభజించి జూన్ 12న విద్యార్థులందరికీ అందచేయనున్నాం.

- వెంకట సుబ్బయ్య, సమగ్రశిక్ష ఏపీసీ

వైభవంగా ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లిలోని కోదండరామస్వామి ఆలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన సీతారాముల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. గురువారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారి గ్రామోత్సవం చేపట్టారు. అనంతరం వసంతోత్సవం, పారువేట కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయా కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9037
వెండి కిలో ధర	రూ. 96.900
వెండి ఒక గ్రాము	రూ.99.90

న్యూస్ బాక్స్

సీతారాములకు ప్రత్యేక పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి), మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమల రేగడ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ దేవస్థానంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్ల గ్రామోత్సవం వైభవంగా చేపట్టారు. తొలుత వేదపండితులు స్వామివార్లకు అభిషేకాలు, హోమాలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు గ్రామంతోపాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 707 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 562 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 145 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 210 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

ఉచిత ఉపనయన మహోత్సవం



ఉపనయన కార్యక్రమం నిర్వహిస్తున్న పూజారి శివయ్యశర్మ

ఆత్మకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకర జయంతి సందర్భంగా ఆత్మకూరు సీమ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శివాలయంలో శుక్రవారం ఉచిత ఉపనయనాలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి శివయ్యశర్మ ఆధ్వర్యంలో గణపతి, గాయత్రి, నవగ్రహ మహాయాగం, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారతీయ సంగీత నృత్య విద్యాలయం ఆర్గనైజర్ అపర్ణాచక్రవర్తి నేతృత్వంలో విద్యార్థులు నిర్వహించిన నృత్య కళా ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

మరుగుదొడ్డిలో మందులు

గ్రామీణులకు అందని మెరుగైన వైద్యసేవలు

సిబ్బంది నిర్లక్ష్యంతో నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



మరుగుదొడ్డిలో పడేసిన మందుల పెట్టెలు, కవర్లు

ఉదయగిరి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సదుద్దేశంతో వైద్యశాలలకు అన్ని రకాల వసతులు కల్పించి 24 గంటల పాటు నిరంతరాయంగా వైద్య సేవలు అందేలా వైద్యులతో సహా సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించినప్పటికీ ఫలితం లేకుండా పోతోందని, దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్ర స్థాయిలో కొందరు ఉద్యోగుల నిర్లక్ష్య వైఖరి కారణంగా వైద్య సేవల సంగతి అటుంచితే కనీసం రోగులకు సంతృప్తికరంగా మందులు అందడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం మండలంలో గండిపాళెం వైద్యశాలలో రూ. లక్షలు విలువైన మందులను వినియోగించకుండానే మరుగుదొడ్లు, ప్రాంగణంలో పడేయడం కనిపించింది. అధికారుల అలసత్వమో, సిబ్బంది నిర్లక్ష్యమో గానీ ట్యాబ్లెట్లు, సిరప్పులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ఇతర విలువైన మందులను సకాలంలో వినియోగించక పోవడంతో కాలం చెల్లి వృథాగా మారాయి. దీంతో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయని అటువైపు చూసిన ప్రతిఒక్కరూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. మరికొన్ని కాలం చెల్లిన మందులను సైతం అట్టపెట్టెలు, కవర్లలో నుంచి బయటకు తీయకుండానే ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు మరుగుదొడ్లలో పడేసి తలుపులు తీసే అవకాశం కూడా లేకుండా చేశారనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మారుమూల ప్రాంతాల పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభకు తరలిన నేతలు



ఉదయగిరి: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న

ఉదయగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించనున్న నేపథ్యంలో నిర్వహించే సభకు శుక్రవారం ఉదయగిరి, దుత్తలూరు మండలాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. ఉదయగిరిలో టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, దుత్తలూరులో టీడీపీ నాయకులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. సభకు తరలివెళ్లే నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు తాగునీరు, భోజన ఏర్పాట్లు సైతం చేశారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : ప్రధాని నరేంద్రమోదీ భారీ బహిరంగ సభకు శుక్రవారం వెలుగు, ఇతర శాఖల ఉద్యోగులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రత్యేక బస్సును ఎంపీడీవో వేణుగోపాలరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు స్వచ్ఛందంగా సభకు హాజరవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

‘కిశోరి వికాసం’తో బాలికల భవితకు భరోసా : సీడీపీవో



సంగం : కిశోరి వికాసంపై గోడ పత్రికలు విడుదల చేస్తున్న అధికారులు

ఉదయగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): బాలికల భవితకు భరోసా కల్పించడమే కిశోరి వికాస కార్యక్రమ ప్రధాన లక్ష్యమని సీడీపీవో సునీత అన్నారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పాల్గొని మాట్లాడుతూ బాలికలకు ఎదురయ్యే రుగ్మతలు, సమస్యలు, శారీరక మార్పులపై 12 రోజుల పాటు 12 అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, రక్తహీనత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో పద్మజ, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

●సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఐసీడీయస్ ఆధ్వర్యంలో బాలికలకు కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోరి వికాసం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీడీపీవో అరుణ బాలికల రక్షణ చట్టాలు, పోక్సో, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి సచివాలయం, పంచాయతీల్లో జూన్ 10వ తేదీ వరకు ఈ అవ గాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట : ప్రతి సచివాలయం పరిధిలో శుక్ర, మంగళవారాలలో కిశోరి వికాసం శిబిరాలు జూన్ 10వ తేదీ వరకు నిర్వహించాలని జిసిడిఎస్ సూపర్‌వైజర్ పి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక అంగనవాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కౌమర దశ బాలికల సమస్యలు తదితర వాటిపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె విజయలక్ష్మి, షహీనబేగం, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు



ట్రోఫీని అందుకుంటున్న కింగ్స్ ఎలెవెన్ జట్టు

సీతారామపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పబ్బులేటిపల్లిలో శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో శుక్రవారం సీతారామపురానికి చెందిన కింగ్స్ ఎలెవెన్ జట్టు, పబ్బులేటిపల్లికి చెందిన జట్టు తలపడగా సీతారామపురానికి చెందిన కెప్టెన్ పాలగిరి సురేష్ సారథ్యంలోని కింగ్స్ ఎలెవెన్ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని అందుకున్నారు. టోర్నీ విజేతకు ప్రైజ్ మనీ రూ20 వేలు అందజేశారు. రన్నరప్‌గా పబ్బులేటిపల్లి జట్టు నిలిచింది. విజేతలుగా నిలిచిన కింగ్స్ ఎలెవన్ జట్టు సభ్యులను పలువురు అభినందించారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందనలు



జానేష్‌ను అభినందిస్తున్న తహసీల్దారు

అనంతసాగరం మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాల విద్యార్థి జానేష్ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 586 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జానేష్‌ను శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు సుభాషిణి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, ఉపాధ్యాయులు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జీవన్ కుటుంబసభ్యులకు పరామర్శ

సంగం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోలిరెడ్డిపాళెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధీపురానికి చెందిన గుండాల జీవన్ చంద్రారెడ్డి అనే వైద్య విద్యార్థి మృతిచెందిన విషయం విదితమే. దీంతో శుక్రవారం అతని కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శించారు.

గుర్రపు డెక్కలో చిక్కుకున్న గేదె

● రక్షించిన యువకులు



గుర్రపు డెక్కలో చిక్కుకున్న గేదెను తాళ్లతో లాగుతున్న యువకులు

ఉదయగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు ఆనకట్టలో ఏపుగా పెరిగిన గుర్రపు డెక్కలో శుక్రవారం ఓ గేదె చిక్కుకుపోయి పైకి రాలేక మూగరోదన చేసింది. దీంతో అటువైపు వెళుతున్న కొంతమంది యువకులు గమనించి ఆనకట్ట నీటిలోకి దిగి తాళ్ల సహాయంతో గేదెను బయటకి తీసి ప్రాణాలు కాపాడారు. దీంతో ఆ యువకులను స్థానికులు అభినందించారు.

ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి



మారంరెడ్డిపల్లిలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయకులు లక్ష్మీనారాయణ

సీతారామపురం, మే 2 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమైనందున భూసారం కోల్పోకుండా అదును బట్టి ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మారంరెడ్డిపల్లి వ్యవసాయ సహాయకులు లక్ష్మీ నారాయణ రైతులకు సూచించారు. మండలంలోని మారంరెడ్డిపల్లి, బసినేనిపల్లి, సింగరెడ్డిపల్లి, సీతారామపురం గ్రామ పంచాయతీలోని నూతి వారికొటలు గ్రామాల్లో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులు వరికి ప్రత్యామ్నాయ పంటల సాగు, భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తప్పనిసరిగా పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకొని సాయిల్ హెల్త్ కార్డులు పొందాలన్నారు. అనంతరం వర్షాధార, ఆరుతడి పంటలు, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించారు.

దాచూరికి ఘన నివాళి



దాచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ ఉద్యమ నేత దాచూరి రామిరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు హనీఫ్, మున్న, ఖాదర్ బాషా, దస్తగిరి అహ్మద్, సుబ్బారెడ్డి, ఫణి, రామిరెడ్డి, రామకృష్ణ, ఉదయ్ పాల్గొన్నారు.

మూగ జీవాలకు వరం.. నీటి తొట్టెల నిర్మాణం

మర్రిపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టింది. నీటి నిర్వహణ, పశుసంవర్ధక శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు చేపడుతున్నారు. ఈ వేసవిలో పూర్తి స్థాయిలో అన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చేలా తొట్టెల నిర్మాణం వేగవంతం చేస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మంది వ్యవసాయం తర్వాత పశువులు, మేకలు, గొర్రెల పెంపకంతో జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయి. దీంతో వేసవి తాపంతో మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో చెరువులు, వాగులు ఇంకిపోయాయి. మెట్ట అటవీ ప్రాంత సమీపంలో నీటి వనరులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మేతకు వెళ్లిన మూగజీవాలు తిరిగి ఇంటికి వచ్చి దాహార్తిని తీర్చుకోవాల్సిందే. మూగజీవాలు మేతకు వెళ్లే ప్రాంతంలో అవసరాన్ని బట్టి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 426 నీటి తొట్టెలు నిర్మిస్తోంది. అందులో మర్రిపాడు మండలంలో మంజూరైన 58 తొట్టెలకు గాను ప్రస్తుతం 26 తొట్టెలు పూర్తయ్యాయి. ఒక్కో తొట్టెకు రూ. 33 వేల వరకు ప్రభుత్వం మంజూరు చేస్తుంది.



డీసీపల్లిలో నిర్మించిన తొట్టెలో నీరు తాగుతున్న మేకలు

CRIME NEWS

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం



హైవేపై బైక్, వెంకటరమణయ్య మృతదేహం

కోవూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై ఉన్న సాయిబాబా గుడి సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఉదయం లారీ ఢీకొనడంతో కొడవలూరు మండలంలోని మానేగుంటపాడుకు చెందిన కాకుమూడి వెంకటరమణయ్య (41)మరణించాడు. ఈయన ప్రతిరోజూ నీటిబోర్లు వేసే కూలీ పనులకు వెళ్తుంటాడు. అందులో భాగంగా కూలీ పనికోసం ఆయన ఇంటి వద్ద నుంచి మోటారు బైక్‌పై వేకువనే నెల్లూరుకు బయలుదేరాడు. నగరంలోని హరనాథపురంలో పనిముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ, డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాల్టీ పరిధిలోని నాగేంద్రపురం సమీపంలోని రైస్‌మిల్లులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం దేపూరు గ్రామానికి చెందిన నూరుల్లా (28)కి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అతనికి పిల్లలు లేరు. నూరుల్లా శుక్రవారం ఉదయం దేపూరు గ్రామం నుంచి ఆటోలో వడ్లు లోడు చేసుకుని రైస్‌మిల్లుకు చేరుకున్నాడు. రైస్‌మిల్లు అప్పటికి తెరవకపోవడంతో యజమానికి ఫోన్‌చేసి బహిర్భూమికెళ్లాడు. అనంతరం ఏమి జరిగిందో ఏమోగాని సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మద్యానికి బానిసై కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకున్నట్లు తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 20న ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... నగరంలోని అల్లీపురానికి చెందిన వెంకట రమణయ్య (47) తన భార్యతో ఏర్పడిన వివాదం కారణంగా మద్యంలో గడ్డిమందు కలుపుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే అతనిని వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బోల్తాపడ్డ ఆటో

ఏఎస్ పేట, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన చిరమన గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి ఏఎస్ పేటకు వస్తున్న ఆటో చిరమన గ్రామం మలుపు వద్దకు రాగానే మదారాబాదు గ్రామం నుంచి ఏఎస్ పేటకు వస్తున్న బైక్ ఎదురుగా రావడంతో తప్పించబోయి అదుపు తప్పి ఆటో, బైక్ బోల్తా పడ్డాయి. దీంతో ఆటోలోని మహిళకు, బైక్‌పైన వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం 108లో ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ

● లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

● రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



ఘటనాస్థలిలో ఆయిల్ ట్యాంకర్, లారీ

వెంకటాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఆయిల్ ట్యాంకర్‌ను లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో లారీ డ్రైవర్ ఇరుక్కుపోవడంతో స్థానికులు, పోలీసులు కలిసి బయటకు తీశారు. ఆయిల్ ట్యాంకర్‌లోని వారికి స్వల్పగాయాలయ్యాయి. సర్వేపల్లి నుంచి నెల్లూరు వైపు ఆయిల్ ట్యాంకర్.. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రహదారిపై ఉన్న ట్యాంకర్‌తోపాటు లారీను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. అనంతరం రహదారిపై నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు పునరుద్ధ రించారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

సంగం, మే 2 (ఆంధ్రజ్యోతి):అన్నారెడ్డిపాళెంలో ఓ రైతు పల్లంగా ఉన్న తన పొలంలోకి సమీప పొలాలలో ఉన్న మెరక మట్టిని తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు దాడిచేశారు. రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటరును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 460



అమరావతికి తరలిన మహిళలు

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునఃనిర్మాణ కార్యక్రమానికి దేశప్రధాని నరేంద్రమోదీ వచ్చిన సందర్భంగా శుక్రవారం ఉదయం కావలి నుంచి 5 బస్సుల్లో సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులకు చెందిన మహిళలు బయలు దేరి వెళ్లారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమైన ఈ బస్సులను మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ 5 బస్సులలో 250 మంది వరకు తరలి వెళ్లినట్లు కమిషనర్ తెలిపారు.

న్యూస్ బాక్స్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించటానికి ఈనెల 3నుంచి 5 వరకు గడువు పొడిగిస్తూ ఆర్ఐవో టీ.వరప్రసాదరావు ఉత్తర్వులు జారీ చేశారని గాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ సప్లిమెంటరీ ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇకపై గడువు పొడిగించడం, అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉండదని ఆర్ఐవో స్పష్టం చేసినందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు దత్తాత్రేయస్వామి ఆరాధన

లింగసముద్రం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామ సమీపంలోని మన్నేరు ఒడ్డున వెలసియున్న దత్తాత్రేయ స్వామి ఆరాధన ఈనెల 4వ తేదీన జరగనుంది. ఈ ఆరాధన మహోత్సవానికి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని భక్తులు సందర్శించేందుకు వీలుగా బ్యారికేడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. భక్తులకు మంచినీరు, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు. రాత్రి పండరి భజన, హరిశ్చంద్ర నాటక ప్రదర్శన, అగ్ని గుండం ప్రవేశం జరుగుతుందన్నారు. ఆరాధన ముందు రోజైన శనివారం సాయంత్రం దత్తమాల ధరించిన సుమారు వెయ్యి మందకి పైగా మాలాధారులు మొగిలిచెర్ల గ్రామంలోని రామాలయం వద్ద స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం కళశాలతో ఊరేగింపుగా దత్తాత్రేస్వామి ఆలయం వద్దకు వచ్చి స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారిన, రాత్రికి అక్కడే ఉండి అరాధన మహోత్సవం రోజున పూజలు చేసి 5న పొంగళ్లు పెట్టుకొని, దీక్ష విరమిస్తారని పవని ప్రసాద్ చెప్పారు.

ప్రసన్నుడి ఆలయ మహా ప్రాకారానికి హద్దులు

బిట్రగుంట, మే 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ మహాప్రాకార నిర్మాణానికి కావలి డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు శుక్రవారం హద్దులు ఏర్పాటు చేశారు. ఆలయానికి మహాప్రాకారం ఏర్పాటు చేయాలన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సూచనల మేరకు ఆలయ మాజీ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి సర్వేర్లతో కొండ దిగువన చుట్టుకొలతలు తీయించారు. గిరిప్రదక్షిణ రోడ్డుకు ఆటంకం కలుగకుండా ఆలయ నాలుటు మూలల హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేరు వెంకటేశ్వర్లు. విశ్రాంత ఇంజినీరు గోపీకృష్ణ, స్థానికులు, గ్రామ సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.280

కలిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 397 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 301 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-73, ఆర్ఆర్-2, సీఆర్-18, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 96 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.250.11గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి ఇస్సాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

అభివృద్ధి పనుల తనిఖీ

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాంలు పరిశీలించారు. స్థానిక వైకుంఠపురంలో రూ.20లక్షలతో జరుగుతున్న అన్నపుగుంట ఆధునికీకరణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలన్నారు. ఉదయగిరి రోడ్డులో విట్స్ కళాశాల ఎదురుగా మున్సిపాల్టీ షాపులు నిర్మాణాల కోసం నూతనంగా ఐరన్ వెల్డింగ్‌లతో నిర్మిస్తున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి): కావలి తాలూకా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కచ్చేరిమిట్ట రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చలవేంద్రాన్ని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య శుక్రవారం ప్రారంభించారు. గత మూడేళ్లుగా తమ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పీ.రవికుమార్, జల జనాభయ్య, యేపూరు వెంకయ్య పాల్గొన్నారు.

కుల గణనపై కేంద్రం నిర్ణయం అభినందనీయం

ఉలవపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి) : జనగణనలో కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆవుల నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అనేక పర్యాయాలు ఢిల్లీలో ఉద్యమాలు, ధర్నాలు చేపట్టిందన్నారు. ప్రధాన మంత్రి మోదీ కుల గణన చేపట్టనుండడం, బీసీ కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలపడం సంతోషకరమని తెలిపారు.

ప్రమాదభరితంగా కల్వర్టులు!

» నాణ్యతా ప్రమాణాలకు తూట్లు
» మూడేళ్లకే కాంక్రీట్ కనుమరుగు
» వాహనచోదకుల ఆందోళన

అల్లూరు, మే 2(ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన కల్వర్టులు అనతి కాలంలోనే ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడం, ధనార్జనే ధ్యేయంగా కాంట్రాక్టరు నాశిరకంగా పనులు చేపట్టడంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 19.5 కిలోమీటర్ల రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.33.50 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. అదే సమయంలో ఎన్నికలు సమీపించడంతో ఆగిన టెండర్ల ప్రక్రియ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో కొనసాగింది. ఈ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ మార్గంలో అల్లూరు నుంచి పైడేరు వరకు సుమారు 7 కల్వర్టులు నిర్మించారు. ఇందుకు ఒక్కో కల్వర్టుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వెచ్చించారు. ఆ తరువాత నిధులు విడుదల కాకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి బాగున్న రోడ్డు కాస్తా మరింత గతుకులుగా మారిపోయింది. కల్వర్టుల వద్ద పరిస్థితి దారుణంగా మారింది. కల్వర్టుల నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కాంట్రాక్టరు నాణ్యతకు తూట్లు పొడిశారు. దీంతో అవి నిర్మించిన మూడేళ్లకే కాంక్రీటు కొట్టుకుపోయి ఇనుప కమ్మీలు బయటపడ్డాయి. దీంతో వాహనచోదకులకు ప్రమాదంగా మారింది. బయటపడిన ఇనుప చువ్వలు విరిగి వాహనాల టైర్లకు దిగబడి టైర్లు పంచర్లు కావడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ చేతివాటంతో నాశిరకంగా కల్వర్టులను నిర్మించడంతో మూడేళ్ల గడవకముందే కాంక్రీటు కాస్తా కొట్టుకుపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. కమ్మీలు బయటపడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనచోదకులు అంటున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్మించిన కల్వర్టులు రోడ్డు కిందికి వెళ్లిపోతాయని భావించిన కాంట్రాక్టరు ఆ పనులు నాశిరకంగా చేపట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో కాంట్రాక్టరు చూపిన చేతివాటం మూడేళ్ల గడవక ముందే బట్టబయలైంది. కల్వర్టుల వద్ద కాంక్రీటు కొట్టుకుపోయి ఇనుప కమ్మీలు బయటపడడంతో అల్లూరు పట్టణ పరిధిలోని పాత పెట్రోలు బంకు సమీపంలో నిర్మించిన కల్వర్టు వద్ద ఇటీవల ఓ ప్రముఖ టీవీ ఛానల్ విలేకరి ద్విచక్ర వాహనంపై వెళ్తూ వాహనానికి కమ్మీలు తగులుకొని కింద పడిపోయాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలై నెల్లూరులోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. ఇలాంటి ప్రమాదాలు నిత్యం జరుగుతోన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టలు వద్ద మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



కాంక్రీటు కొట్టుకుపోవడంతో బయటపడిన ఇనుప కమ్మీలు, (అంతరచిత్రం)లో పైకి లేచి ప్రమాదకరంగా ఉన్న ఇనుప కమ్మీలు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రహదారి నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. నిధులు విడుదల చేయించి త్వరలో పనులు ప్రారంభిస్తాం.

- భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

నేటి నుంచి ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలు

లింగసముద్రం, మే 2 (ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు ఆలయము ముస్తాబైంది. ప్రతిరోజూ ఉదయం సుప్రభాతం, హోమం, వేదపారాయణం, సాయంత్రం సహస్ర నామార్చన, చక్ర పెరుమాళ్ల గ్రామోత్సవం, స్వామి వారు, అలివేలు మంగతాయారు, పద్మావతిదేవి సమేతంగా వాహనాలంకృతులై గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు హరికథ, నాటక, పాటకచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉభయకర్తలు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివార్లను రోజుకో వాహనంపై ఊరేగిస్తారు. 10న కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు విరివిగా హాజరై జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు.



ఉత్సవాలకు ముస్తాబైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం

వైభవంగా కలిశ ప్రతిష్ఠ

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముదిరాజ్‌పాలెంలో ఉన్న కోదండరామ స్వామి ఆలయంలో విమానశిఖర కలశం పునః ప్రతిష్ఠ మహోత్సవం, సీతారాముల కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా మూడు రోజులుగా వేదపండితులచే హోమాలు, మహాకుంభాభిషేకం నిర్వహించిన అనంతరం కలశ ప్రతిష్ఠ, స్వామి వారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముదిరాజుపాలెం రామనామస్మరణతో మార్మోగగా పట్టణ ప్రజలు, పురప్రముఖులు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, వడ్లమూడి సురేష్, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, చుండూరి శ్రీను, చక్కా కేశవ, డాక్టరు తన్నీరు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



కలశ ప్రతిష్ఠలో వేదపండితులు

ఆక్రమణల తొలగింపుపై హైకోర్టు స్టే

● పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి బ్రేక్ ?

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. సర్కిల్ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఆక్రమణల తొలగింపులో మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు నిబంధనలు పాటించలేదని, కోర్టు సూచనలను కూడా పాటించలేదని పేర్కొంటూ హైకోర్టు రెండు నెలలపాటు అక్కడ ఎలాంటి పనులు చేపట్టవద్దని స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఆక్రమణల తొలగింపుపై స్థానిక గృహాల యజమానులు మాదాల మోహనరావు, రవీంద్ర తదితరులు కోర్టులో పిటిషన్ వేయడంతో చట్టపరిధిలో ఆక్రమణల తొలగించి సర్కిల్ అభివృద్ధి చేయాలని సూచన చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. అయితే ఆక్రమణలు ఉన్నట్లు నోటీసులు ఇచ్చిన మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాల కూల్చివేతకు నోటీసులు ఇవ్వాల్సి ఉండగా ఆ నోటీసు ఇవ్వకుండానే పోలీసు బందోబస్తుతో కూల్చివేయించారు. దీనిని సవాల్ చేస్తూ వారు తిరిగి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో రెండు నెలలపాటు అక్కడ ఎలాంటి పనులు, ఆక్రమణల తొలగించరాదని స్టే జారీచేయటంతో పాటు మరోసారి ఉన్నతాధికారులతో సర్వే నిర్వహించి సర్వే నివేదికను కోర్టుకు అందజేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. నిబంధనలకు విరుద్ధంగా ఆక్రమణల తొలగింపుకు సిద్ధపడ్డ మున్సిపల్ అధికారులు, పోలీసులపై మానవహక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు చెబుతున్నారు.

గిరిజన బాలికల గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉలవపాడు, మే 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడులో ఉన్న గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎన్.వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మొత్తం 192 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 3వ తరగతిలో 40 సీట్లుకు గాను ఎస్టీ 32, ఎస్సీ 5, బీసీ 2, ఓసీ 1 ఖాళీలు, 4వ తరగతిలో ఎస్టీ 38, 5వ తరగతిలో ఎస్టీ 33, 6వ తరగతిలో ఎస్టీ 32, 7వ తరగతిలో ఎస్టీ 13, 8వ తరగతిలో ఎస్టీ 17, 9వ తరగతిలో ఎస్టీ 10 సీట్లు ఖాళీ ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్టీ గురుకుల పాఠశాల కావడంతో 4 నుంచి 9వ తరగతి వరకు ఏర్పడిన ఖాళీలు ఎస్టీ విద్యార్థులతో మాత్రమే భర్తీ చేయాల్సి ఉన్నందున ఎస్టీలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

దాచూరి జీవితం అందరికీ ఆదర్శం

● యూటీఎఫ్ నేతల ఘన నివాళి

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యవస్థాపకుల్లో ఒకరైన దివంగత మాజీ ఎమ్మెల్సీ దాచూరి రామిరెడ్డి జీవితం ఆదర్శప్రాయమని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కిలారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం రామిరెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి పొన్నగంటి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కందుకూరు ప్రాంతీయ మండలాల యూటీఎఫ్ నాయకులు దామా కొండపనాయుడు, చిత్తారి వెంకటేశ్వర్లు, మక్కెన రమేష్‌బాబు, గొట్టిపాటి మాధవరావు, ముప్పరాజు కోటేశ్వరరావు, కృష్ణకుమార్, ఓవీ రమణయ్య, ఎం. కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ మోహనరావుకు పీహెచ్‌డీ

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కలవకూరి మోహనరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ ప్రకటించింది. క్లౌడ్ కంప్యూటింగ్ వాతావరణంలో డీప్ లెర్నింగ్ ఆధారితంగా వర్క్‌లోడ్ అంచనా, వనరుల కేటాయింపు, నమూనాల పనితీరు మెరుగుదల అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకు ఈ పీహెచ్‌డీ లభించిందని కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. ఈ సందర్భంగా మోహనరావును కళాశాల టెక్నికల్ డైరెక్టర్ కె.విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ వి.హరిబాబు, సహచర అధ్యాపకులు అభినందించారు.

కార్మికులకు న్యాయం చేస్తాం

● నిరసన విరమింపజేసిన సూపరింటెండెంట్

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలను ఈనెల 15వ తేదీలోగా చెల్లించేలా చర్యలు తీసుకుంటానని, వారికి గత కొన్నేళ్లుగా జమకాని పీఎఫ్‌ను కూడా వారిఖాతాల్లో జమ చేయించేలా చూస్తానని ఆసుపత్రి సూపరింటెండెంట్ శకుంతల హామీ ఇచ్చారు. దీంతో మూడు రోజులుగా ఆసుపత్రి వద్ద నిరసన దీక్షలో ఉన్న కార్మికులు శుక్రవారం దీక్షను విరమించారు.



కార్మికులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శకుంతల


కిశోరి వికాసం కార్యక్రమం ప్రారంభం



కిశోరి వికాసం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు

బిట్రగుంట, మే 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమాన్ని సూపర్ వైజర్ కోటేశ్వరి శుక్రవారం ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో సమయాన్ని వృథా చేసుకోకుండా ఆరోగ్యం, ఆర్థికంగా ఎదిగేందుకు రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మే 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోరి వికాసం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా పోలీసు జయశ్రీ, ఇంచార్జి సూపర్‌వైజర్ సుప్రజ, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ పనులకు హాజరైన కూలీల హాజరును పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రత్యూష

కలిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం, కావలిముస్తాపురం, సిద్ధనకొండూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ప్రత్యూష శుక్రవారం పరిశీలించారు. మస్టర్ల రిజిష్టర్లను పరిశీలించి, పనులు చేస్తున్న మహిళా కూలీలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా ఉపాధి పనుల వద్ద మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పామ్‌పండ్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు ప్రత్యేక చర్యలు

● ఎంపీడీవో నరేంద్రదేవ్

వలేటివారిపాలెం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. ఎక్కడా అపరిశుభ్రత వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. చెత్తను సంపద కేంద్రాలకు తరలిస్తాం.



? చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకవస్తారా.

! మండలంలో నిరుపయెగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారులు ఆదేశాలతో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో పలు కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చాం

? దోమల నివారణకు చర్యలు చేపడుతున్నారా.

! గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. అంతేకాకుండా అవసరమైన పంచాయతీల్లో ఫాగింగ్ చేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం.

? ఎన్ని రోజులకు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారు.

! ప్రతి 15 రోజుల కొకసారి వాటర్ ట్యాంకులు క్లోరినేషన్ చేపట్టి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నాం.

? సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా.

! సచివాలయాలపై నిరంతరం తనిఖీలు చేస్తుండడంతో సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం.

పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించిన బుర్రా

కందుకూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పామూరురోడ్డులో ఉన్న కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రాన్ని వైసీపీ ఇంచార్జి, కనిగిరి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం సందర్శించి వేలం తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, బోర్డు అధికారులతో మాట్లాడి అన్నిబేళ్లకు గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కొద్దిశాతం బేళ్లకు అత్యధిక ధర క్వింటాల్‌కు రూ.28వేలు ఇస్తూ మిగిలిన చెక్కులను తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో పాటు నోబిడ్‌లు, సీఆర్‌లు అధికంగా ఉంటుండటంతో రైతులు వ్యయప్రయాసలకు గురవుతూ నష్టపోతున్నారని తెలిపారు. ఈమేరకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ బోర్డు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తోకల కొండయ్య, గంగిరెడ్డి, ఏ. లక్ష్మీనరసింహం, నలమోతు చంద్రమౌళి, ఈదర రమేష్, షేక్ రఫీ తదితరులున్నారు.





పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం

అద్భుతంగా అమరావతి

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాశం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు





సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు





మహిళల విజయ దరహాసం





దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం



యథావిధిగా 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'

● అర్జీల సమాచారానికి కాల్ సెంటర్ ● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈనెల 5న సోమవారం యథావిధిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్నీ మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజనల్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని ప్రజలను కోరారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకపోయినా, ఏ దశలో ఉందో సమాచారం కోసమైనా కాల్ సెంటర్ నెంబరుకు 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ పర్యటన

వింజమూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం నెల్లూరుకు చేరుకుని జయభారత్ ఆసుపత్రిలో పలు విభాగాలను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో కలిసి ప్రారంభిస్తారు. అనంతరం తిరుపతికి బయలుదేరి వెళతారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించ డానికి ఈనెల 3 నుంచి 5వతేదీ వరకు గడువు పొడిగించి నట్లు ఆర్ఐవో టీ వర ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజులు సకాలంలో చెల్లించని విద్యార్థుల సౌకర్యార్థం ఇంటర్ బోర్డు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువు పెం చిందని తెలిపారు. కళా శాలల ప్రిన్సిపాళ్లు చొరవ తీసుకుని విద్యా ర్థులు ఫీజులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

నాకు పెళ్లి వద్దు.. చదివించండి!

● మేయర్‌ను వేడుకున్న గిరిజన బాలిక

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నాకు పెళ్లి వద్దు.. నన్ను ఎలాగైనా చదివించండి అని నాగుల సునీత అనే గిరిజన బాలిక నెల్లూరు కార్పొరేషన్ మేయర్ స్రవంతిని శుక్రవారం వేడుకుంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా కోటలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలికలు)లో 7వ తరగతి పూర్తి చేసి, గత నెల 23వతేదీ వేసవి సెలవులకు ఇంటికి వెళ్లిన నాగుల సునీత అనే గిరిజన బాలికకు తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేసిన విషయం తెలిసిందే. ఆ బాలిక ప్రస్తుతం నెల్లూరులోని బాలసదన్‌లో ఉంది. ఈ విషయం ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకున్న గిరిజన (యానాది) విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు మేయర్ పొట్లూరి స్రవంతికి తెలియజేశారు. మేయర్ ఆ గిరిజన బాలిక ఉంటున్న బాల సదన్‌కు వెళ్లారు. బాలికతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ బాలిక తనకు పెళ్లి వద్దని.. నేను బాగా చదువుకోవాలని మేయర్ వద్ద బోరున విలపించింది.



గిరిజన బాలికతో మేయర్ స్రవంతి

సునీతను మేయర్ ఓదార్చారు. చదువుకు అండగా ఉంటామని, తల్లిదండ్రులతో మాట్లాడి వేసవి సెలవుల అనంతరం మళ్లీ గురుకుల పాఠశాలలో చేర్పిస్తామని హామీ ఇచ్చారు. చైతన్య వేదిక ఆధ్వర్యంలో బాలికకు రెండు జతల బట్టలు, పండ్లు, తినుబండారాలను అందజేశారు.

మధుసూదనరావు కుటుంబానికి అండగా ఉంటా

● సినీ నటుడు మంచు విష్ణు



మధుసూదనరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సినీహీరో మంచు విష్ణు

కావలి, మే 2(ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడిలో మృతి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి తాను అండగా ఉంటానని సినీ నటుడు మంచు విష్ణు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన కావలిలోని మధుసూదనరావు నివాసానికి వచ్చి ఉగ్రదాడి ఎలా జరిగిందని తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మా తల్లిగారిది నెల్లూరు జిల్లా అయినందున తాను జిల్లా వాసిగా పరామర్శించడానికి వచ్చానన్నారు. మీ కుటుంబానికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తెస్తే మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ మేరకు తనతో పాటు తన పీఆర్వో ఫోన్ నెంబర్లు ఇచ్చారు. పిల్లలు ఎంత వరకు చదువుకున్నా వారిని చదివించే బాధ్యతను కూడా తాను తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకుని వారికి ఏమి చేయదలచుకున్నానో చెప్పానని, ఆ విషయం బయటకు చెప్పదలచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ కౌన్సిలర్ అమరా వేదగిరి, తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో రెండు సర్టిఫికెట్ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులకు అసెంబ్లీ ఆపరేటర్-రెఫ్రిజిరేటర్, ఎయిర్ కండిషనర్, సోలార్ పీవీ ఇన్‌స్టాలేటర్ కోర్సుల్లో ఉచితంగా మూడు నెలలు శిక్షణ ఇస్తారన్నారు. ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు అందించి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు కళాశాలలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న బత్తల పద్మావతి

అనాథ బాలల దత్తతను పూర్తి చేయాలి

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : శిశు గృహాల్లో ఉన్న పిల్లల దత్తతను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అధికారులకు సూచించారు. జిల్లాలో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దత్తతపై శుక్రవారం నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశు గృహాల్లోని అనాథ బాలల దత్తతను పూర్తి చేయడానికి అన్నీ శాఖలు సహకరించాలని కోరారు. వన్‌స్టాప్ సెంటర్‌కు ప్రతినెల ఎన్ని కేసులు వస్తున్నాయి?, రిజిస్ట్రేషన్ ఎంత అవుతోంది?, ఎంతమందికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు, ఎంత మంది మహిళలకు పునరావాసం కల్పిస్తున్నారనే విషయాలపై కూడా చర్చించారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ మాట్లాడుతూ జిల్లాలో పిల్లల దత్తత విషయంలో ఎటువంటి జాపస్యం లేకుండా చూస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ కమిటీ సభ్యులు టీ మాధవి, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్, బాలల పర్యవేక్షణ అధికారి బీ సురేష్, జీసీడీవో మమతా తదితరులు పాల్గొన్నారు.

రామానుజాయనమః

భక్తిశ్రద్ధలతో సమతామూర్తి జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 (ఆంధ్రజ్యోతి) : విశిష్ట అద్వైత సిద్ధాంతకర్త, సమతా మూర్తి, సంఘ సంస్కర్త భగవద్‌రామానుజాచార్యుల జయంతిని జిల్లాలోని వైష్ణవాలయాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిపారు. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న రామానుజుల 1008వ జన్మ తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున శ్వేతఛత్ర మహోత్సవం, మంగళశాసనోత్సవం, పినాకినీ నది నుంచి తీర్థ సంగ్రహణం జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి, భగవద్రామానుజాచార్యులకు ఏకోత్తర సహస్ర (1001) కలిశాభిషేకం, తిరుమంజనసేవ కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా భక్తుల గోవింద నామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. రాత్రి దాదాపు అరవై అడుగుల విశేష పుష్ప పల్లకీలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి, భగవద్రామానుజులు వారికి ఉత్సవం జరిగింది. భారీ విద్యుద్దీపాలంకరణ, మంగళవాయిద్యాలు, బ్యాండు కచేరీ, బాణాసంచా వేడుకలతో ఈ పల్లకీ ఉత్సవం సాగింది. ఆలయం నుంచి రంగనాయకుల పేట, సంతపేట, కేవీఆర్, పెట్రోలు బంకు మీదుగా ఉభయకర్త ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇంటి వరకు సాగింది. భక్తులు ఇంటింటా కర్పూర నీరాజనాలు అర్పించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.



రంగనాథస్వామి ఆలయంలో పూజలందుకున్న రామానుజాచార్యులు

పల్లె వైద్యానికి సుస్తీ

24 నుంచి సమ్మె చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

మూతపడ్డ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు



ఉదయగిరిలోని విలేజ్ హెల్త్ క్లీనిక్

ఉదయగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): గ్రామీణులకు వైద్యసేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లీనిక్‌లను తీసుకొచ్చింది. జిల్లాలో 3 నుంచి 4 వేల జనాభాకు ఒకటి చొప్పున ఈ కేంద్రాలను ప్రారం భించింది. ఒక్కో కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని మల్టీలెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)గా నియమించింది. వీరు ఒక్కో కేంద్రంలో 14 రకాల వైద్యసేవలు అందజేయాలి. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు వీరికి సహకారం అందిస్తారు. రోజుకు 30 నుంచి 40 మంది రోగులకు వైద్యసేవలందిస్తారు. అయితే ఇన్సెంటివ్ ఇవ్వడంలేదని, వేతనాలు పెంచాలని, పని వత్తిడి తగ్గించాలని ఈనెల 24 నుంచి వీరు ఆందోళన బాటపట్టారు. దీంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు తాళం పడడంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందక పల్లె ప్రజలు అవస్థలు పడుతున్నారు. అనారోగ్యానికి గురైన వారు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు బాధపడుతున్నారు. సమ్మె చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు విధుల్లో చేరాలని ప్రభుత్వం నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పనను వివరణ కోరగా ఈనెల 24 నుంచి ఎంఎల్‌హెచ్‌పీలో సమ్మెలో ఉన్నారని, కేంద్రాల్లో ఏఎన్‌ఎం, ఆరోగ్య కార్యకర్తల ద్వారా రోగులకు సేవలందిస్తున్నామని తెలిపారు.



నేలకొరిగిన వరి పైరు

మండలంలోని గండిపాళెంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురవడంతో సాగులో ఉన్న వరి పంట నేలవాలింది. దీంతో ఆరుగాలం కష్టించి సాగు చేసిన వరి పంట చేతికందే సమయంలో నేలవాలడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు పదెకరాల్లో వరి పంట నేలవాలిందని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

విద్యుత్ సరఫరాకు అంతరాయం

● రోగులకు తప్పని అవస్థలు

రాపూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర అవస్థలు పడ్డారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని సిబ్బంది తెలిపారు. జనరేటర్ ఉన్నా కూడా డీజల్ లేదని సిబ్బంది చెప్పారు. దీంతో ఎండ వేడిమికి ఆసుపత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9037
వెండి కిలో ధర	రూ. 96,900
వెండి ఒక గ్రాము	రూ.99.90

న్యూస్ బాక్స్

గ్రామ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొడవలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పాతవంగల్లు పంచాయతీలోని ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకులు వడ్లమూడి నరేంద్రబాబు అన్నారు. గురువారం ఆయన బొంతలపాలెం నీటిపారుదల కాలువ పూడికతీత పనులను ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పనులు సొంత నిధులతో చేపట్టినట్లు తెలిపారు. నేడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయన వెంట నాయకులు, తదితరులున్నారు.

కోనలో బ్రహ్మోత్సవాలపై నేడు సమీక్ష

రాపూరు, మే 2(ఆంధ్రజ్యోతి):పెంచల కోన బ్రహ్మోత్సవాలకు సంబంధించి శనివారం పెంచలకోనకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రానున్నట్లు ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జరిగే సమీక్షా సమావేశంలో వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు ఆర్డీవో అనూష అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ఉప కమిషనర్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

రాపూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు జనసేన పార్టీ రాపూరు నాయకులు కొండాపురం కస్తూరి ఆధ్వర్యంలో ఆర్టీసీ కూడలి వద్ద చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ చలివేంద్రంలో మజ్జిగ, పుచ్చకాయ, మంచినీరు ప్రజలకు అందించారు. కార్యక్రమంలో వెంకటగిరి జనసేన ఇన్‌చార్జి తోట కృష్ణయ్య, మండల కూటమి నాయకులు, జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి పల్లకీసేవ

బుచ్చిరెడ్డిపాళెం, మే2 (ఆంధ్రజ్యోతి):జొన్నవాడ కామాక్షితాయికి శుక్రవారం పల్లకీ సేవ నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణం చేపట్టారు. అలాగే స్థానిక నగర పంచాయతీలోని కాశీపాళెం భద్రావతి సమేత భావనారుషీశ్వర స్వామి కళ్యాణం కమనీయంగా సాగింది. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మలవతు వెంకట సుధాకర్, లత దంపతులు ఉభయకర్తలుగా వ్యహరించారు. చెన్నైకి చెందిన కాసుల రామ్మూర్తి సోదరులు భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్డు మార్జినే కదా.. తవ్వేస్తే పోలా!

● ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అక్రమార్కులు ● పట్టించుకోని అధికారులు

విడవలూరు, మే 2 (ఆంధ్రజ్యోతి):మండలంలో రోడ్డు భవనాలశాఖకు సంబంధించిన చెందిన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా ఆ శాఖ అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదు. వెడల్పుగా ఉన్న రోడ్లు కబ్జాకు గురై ప్రమాదాలు జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని వాహనదారులు, ప్రయణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అన్నారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని భద్రాచలం సమీపంలో 200మీటర్ల రోడ్డు మార్జిన్ భూమిని ఓ వ్యక్తి ఇష్టారీతిన తవ్వుకుని ఆ మట్టిని తన పొలంలోకి తరలించాడు. ఇలా చేస్తే ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ప్రశ్నిస్తే తన పొలంలోనే మట్టిని తవ్వుకున్నానని సదరు వ్యక్తి సమాధానం ఇస్తున్నాడు.

● ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు?

విడవలూరు నుంచి ఊటుకూరు గ్రామానికి వేళ్లే ప్రధాన రహదారి సుమారు 40అడుగుల వెడల్పు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాంటి రహదారిని ఆక్రమించుకున్న అన్నా రెడ్డిపాలెంకు చెందిన ఓ వ్యక్తి మార్జిన్‌లో ఉన్న మట్టిని 3అడుగుల మేర తవ్వి మట్టిని తరలించారు. ఇలా మట్టి ని తరలించటంతో ఎదురుగా రెండు వాహనాలు వచ్చినపుడు అటు వైపు వెళితే అదుపు ప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. అంతేకాకుండా వర్షాలు పడినపుడు రోడ్డు కోతకి గురవుతుంది. ఇన్ని అవాంతరాలున్నా ఆక్రమణలు తగ్గడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అధికారులు సమస్య పరిష్కారంపై నిర్లక్ష్యం వీడాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్‌లో ఉన్న స్థలాన్ని తవ్విన దృశ్యం

చర్యలు తీసుకుంటాం..

విడవలూరు నుంచి ఊటుకూరు గ్రామానికి వేళ్లే ప్రధాన రహదారి ఆక్రమణకు గురవుతున్నట్లు కొందరు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానరోడ్డు మార్జిన్లు ఆక్రమించడం సరికాదు. ఆక్రమణను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

– చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ కొవ్వూరు

లీగ్ దశకు నాలుగు మహిళా జట్లు

● ఉత్కంఠగా సాగిన సాఫ్ట్‌బాల్ పోటీలు



లీగ్ దశకు చేరుకున్న శివాజీ యూనివర్సిటీ జట్టు

వెంకటాచలం,మే2 (ఆంధ్రజ్యోతి):మండ లం లోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరు గుతున్న జాతీయ అఖిల భారత ఇంటర్ యూ నివర్సిటీల సాఫ్ట్‌బాల్ మహిళల విభాగ టోర్న మెంట్ మూడోరోజు (శుక్రవారం) నాక్ అవుట్ దశ పూర్తయింది. ఈ దశలో 95మహిళా జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో ఓటమి లేకుండా ని లిచిన నాలుగు జట్లు శుక్రవారం సాయంత్రం లీ గ్ దశకు చేరుకున్నాయి. హర్యానా రాష్ట్రం రోహతక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ, పంజాబ్ రాష్ట్రం పగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ, మహారాష్ట్ర రాష్ట్రం కొల్హాపూర్‌లోని శివాజీ యూనివర్సిటీ, పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లోని గురునానక్‌దేవ్ యూనివర్సిటీలు లీగ్ దశకు చేరుకున్నాయి. లీగ్‌దశకు చేరిన నాలుగు జట్లు శనివారం ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో హోరాహోరీగా తలపడనున్నాయి. వీటిలో ఎక్కువ మ్యాచ్‌లు గెలిచిన జట్టు విన్నర్, రన్నర్లుగా నిలవనున్నాయి. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీ నివాసరావు అధ్యక్షతన జరుగుతున్న సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌కు వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ అధ్యాపక, అధ్యా పకేతర సిబ్బంది, వివిధ యూనివర్సిటీల కోచ్‌లు, అంపైర్లు రిఫరీలు పర్యవేక్షిస్తున్నారు.

● రేపు మహిళా టోర్నీ ముగింపు

సాఫ్ట్‌బాల్ మహిళల విభాగం టోర్నమెంట్ ముగింపు వేడుక ఆదివారం జరగనుంది. ఈ వేడుకకు ముఖ్యఅతిథులుగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమో హన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమా పాల్గొనున్నారు. టోర్నమెంట్ విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నారు.

బాల్యవివాహాలపై అవగాహన ర్యాలీ

మనుబోలు, మే 2 (ఆంధ్రజ్యోతి):పిడూరు గిరిజనకాలనీలో శుక్రవారం బాల్యవివాహాలపై అంగన్‌వాడీ కార్యక ర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీ ఎస్ సూపర్ వైజర్ రమణమ్మ మాట్లాడారు. కిశోరబాలికలకు ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం అన్నారు. అలాగే తల్లిదండ్రులు ఆడపిల్లలకు 18, మగపిల్లలకు 21ఏళ్ల వచ్చిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. అలాకాదని ముందుగా చేస్తే చట్టరీత్యా శిక్షార్హుల వుతారన్నారు. ప్రస్తుతం ఎండలు మండి పోతున్నాయని, ఈ సమయంలో ఎక్కువ నీటిని తీసుకోవాల న్నారు. లేకుంటే శరీరం అలసటకు గురవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నాగేంద్రమ్మ, ఆశా, అంగన్‌వాడీ కార్యక ర్తలు సుబ్బమ్మ, అరుణమ్మ, కృష్ణవేణి, మహాలక్ష్మి, విజయమ్మ పాల్గొన్నారు.

గర్భిణులూ పేర్లు నమోదు చేసుకోండి

కోవూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): గర్భవతులు తమ పేరు, వివరాల్ని ఈ- పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి ఉమామహేశ్వరి కోరారు. ఇనమడుగు ప్రాథమిక వైద్యశాలలో శుక్రవారం జరిగిన వైద్య సిబ్బంది సమీక్షలో మాట్లాడారు. ప్రసవం అయిన వెంటనే బిడ్డ వివరాల్ని కూడా ఈ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసినందు వల్ల బాలలకు వ్యాక్సిన్లు వేయడం సులభతరం అన్నారు. ఖచ్చితమైన సమయంలో బాలలందరికీ వ్యాక్సిన్లు వేసేందుకు ఈ-పోర్టల్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యు-విన్ కోర్డినేటర్ డేనియల్, కృష్ణమ్మ మాట్లాడారు. ఆరోగ్యకేంద్రం పరిధిలోని వైద్యసిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యం

● కల్నల్ అరుణ్‌కుమార్



ఫైరింగ్ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

వెంకటాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి):దృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం, నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యపడుతుందని కల్నల్ అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతీనగర్‌లోని అక్షర విద్యాలయంలో లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొదంగవే సారథ్యంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మట్లాడారు. శారీరక వ్యాయామం, యోగసనాలు, షిప్ మోడలింగ్, ఆయుధ శిక్షణ వంటి పలు విషయాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవా లన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు ఎన్ దినేష్, ఈశ్వర రావు, గుండాల నరేంద్రబాబు, మల్లికార్జునరెడ్డి, మస్తానయ్య, కొండారెడ్డి, విద్యాసాగర్, ఆరోరా, సాయి శంకరి ఉన్నారు.

అమరావతికి తరలిన రైతులు

మనుబోలు, మే 2 (ఆంధ్రజ్యోతి):అమరావతి పునఃప్రారంభోత్సవానికి శుక్రవారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచనలతో, ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాల రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రానికి చేరుకుని రెండు బస్సుల్లో అమరావతికి తరలివెళ్లారు. రాష్ట్ర రాజధాని అయిన అమరావతి పునఃప్రారంభోత్సవంకు తీసుకెళ్లడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నూరు రామకృష్ణయ్య, రాజాగౌడ్, సుమన్‌తేజ, సాని ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

●వెంకటాచలం (ఆంధ్రజ్యోతి): అమరావతిలో శుక్రవారం జరిగిన ప్రధాని నరేంద్రమోడీ బహిరంగ సభకు కూటమి నేతలు, కార్య కర్తలు, మహిళలు భారీగా తరలివెళ్లారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో జనం వెళ్లారు.



వెంకటాచలం: తరలివెళుతున్న నాయకులు, రైతులు

కిశోర వికాస్ వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● సీడీపీవో విజయలక్ష్మి

పొదలకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు నిర్వహించే కిశోర వికాస్ వేసవి శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం నాలుగో సచివాలయపరిధిలోని లింగంపల్లితోపు, మం డలంలోని విరువూరు సచివాలయం పరిధిలోని ఇసకపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. 11నుంచి 15ఏళ్లు.. 15నుంచి 18ఏళ్ల నిండిన బాలికలను గ్రూపులుగా విభజించి వారానికి రెండు రోజులు వారికి బాల్యవివాహాలు, ఆరోగ్యం, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్‌టచ్ బ్యాడ్ టచ్, అలాగే బాలికల పరిరక్షణకు అందుబాటులోని చట్టాలపై గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్య క్రమంలో సూపర్ వైజర్ ఎం.జ్యోతిలక్ష్మీ, ఆదినారాయణమ్మ, కార్యదర్శి సీహెచ్.సుమన్, మహి ళా పోలీస్ పి.దివ్యవాణి, సీహెచ్ వి.రూప, ఏఎన్‌ఎం బి.చిత్ర, అంగన్‌వాడీ వ ర్కర్లు బుజ్జమ్మ, సుగుణమ్మ, సునీత, ఆశాకార్యకర్తలు సీహెచ్ అంకమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, మహిళలు

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసిన సేవాకమిటీ సభ్యుడు

బుచ్చిరెడ్డిపాళెం, మే 2 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని జొన్నవాడ ఆలయ నూతన సేవా కమిటీ సభ్యుడు తిరువాయిపాటి నందకుమార్ శుక్రవారం నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి సేవా కమిటీలో సభ్యుడిగా కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సెర్ప్ సీఈఓతో చేనేతలు



మాట్లాడుతున్న వాకాటి కరుణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 2(ఆంధ్రజ్యోతి): ఇస్కపాళెంలో 17ఎస్‌హెచ్‌జీలో 170మంది చే నేతలు శుక్రవారం సెర్ప్ సీఈఓ కరుణను కలిశారు. గ్రామంలో చేనేత కార్మికులకు శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం ఆర్థికసాయం అందిచేందుకు భరోసా ఇవ్వడంతో పాటు తయారు చేసే చీరలకు మార్కెట్ సదుపాయంపై ఏడీ హ్యాండ్‌లూంను ఆదేశించారు. సీఈఓ వెంట డీఆర్‌డీఏ పీడీ, డీపీఎం బీ ఎల్, హ్యాండ్‌లూం ఏడీ, డైరెక్టర్, ఏపీఎం, సీసీలు వున్నారు.

● నెల్లూరు (హరనాథపురం) :కాకుపల్లి గ్రామంలోని ఎస్‌హెచ్‌జీ మహిళ నిర్వహిస్తున్న ఒక సూపర్ మార్కెట్‌ను కరుణ పరిశీలించి ఆ మహిళను అభినందించారు.

కోనలో ప్రత్యేక పూజలు

రాపూరు, మే 2 (ఆంధ్రజ్యోతి):పెంచల కోనలో రామానుజజయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్నపన తిరుమంజనం, శ్రీవార్లకు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం విశేష ఆస్థానం, తిరువీధి ఉత్సవం (క్షేత్రోత్సవం) వైభవంగా నిర్వహించినట్లు ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

విద్యుత్ కోతలు.. సర్వర్ సమస్యలు

● ఆందోళనలో డీఎస్సీ అభ్యర్థులు

● మే 15తో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం, మే 2 (ఆంధ్రజ్యోతి): తరచూ విద్యుత్‌కోతలతో డీఎస్సీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు దరఖాస్తు చేసుకునేందుకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అసలే నెట్ సెంటర్లలో సర్వర్ల సమస్యలు. దీనికి తోడు విద్యుత్ కోతలు ఉండటంతో తలలు పట్టుకుం టున్నారు. దరఖాస్తుల స్వీకరణ మే 15తో ముగియనుండటంతో ఎలాగైనా దరఖాస్తు స్వీకరణ గడువును పూర్తి చేయాలని కేంద్రాల వద్ద గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. అభ్యర్థులంతా ఏదో ఒక పార్ట్ టైం జాబ్‌లు చేసుకుంటూ రేయింబవళ్లు వెసులుబాటు వున్న సమయాన్నంతా పరీక్షలకు సిద్ధం అయ్యేందుకే ఉపయోగించుకుంటున్నారు. విద్యుత్ కోతలు.. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమస్య ఒకటైతే.. చదువుకోవాలన్నా ఉక్కపోతలతో ఇబ్బందులు మరో సమస్యగా మారిందని వాపోతున్నారు. డీఎస్సీ పరీక్షలు పూర్తయ్యేవరకు విద్యుత్ కోతలను తగ్గించాలని కోరుతున్నారు.

● ఒక్క అప్లికేషన్ నమోదుకు అరగంట సమయం

డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ నమోదు చేయాలంటే ఏ సమస్యా లేకుంటే 40నుంచి 50 నిమిషాలు పడుతుందని నెట్ సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు. కరెంటుపోతే మళ్ళీ మొదటి నుంచి పని ప్రారంభించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీంతో రోజుకు 10అప్లికేషన్లు కూడా చేయలేకపోతున్నామని చెబుతున్నారు. ఈ విషయంపై ఏడీఈ సతీష్‌ను వివరణ కోరగా ఎల్‌సీలు, ఫీజ్‌లు రిపేర్లతో పాటు ఊహించని పరిణామాలతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందే తప్ప విద్యుత్ కోతలు లేవంటున్నారు.

కబ్జాదారులతో మిలాఖత్

పొదలకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి):పట్టణ సమీపంలో సత్యనారాయణ లే అవుట్ వేశారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన 286అంకణాల స్థలాన్ని కొంతమంది మాఫియాగా ఏర్పడి కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి అమ్ముకుంటున్నారని సత్యనారాయణ ట్రేడర్స్ లే అవుట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, సర్వేపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ వెంపులూరు అరుణ, తెలుగు యువత ఉపాధ్యక్షుడు బ్రహ్మదేవి చంద్రశేఖర్, తెలుగు యువత నాయకులు రావూరి సుధీర్‌నాయుడులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ 2019లో కాకాణి గోవర్ధన్‌రెడ్డి అనుచరులు ఈ లేఅవుట్‌లోని పబ్లిక్ ప్రాపర్టీని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తాము అప్పటినుంచి పోరాటం చేస్తూనే ఉన్నట్లు వాపోయారు. అప్పట్లో ఈ స్థలం పంచాయతీ సంబంధించినది అని అందులో ఎవరూ ప్రవేశించరాదని పంచాయతీ నిర్వాహకులు బోర్డును ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో ఆక్రమణ సాధ్యం కాకపోవడంతో తిరిగి ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక కొంతమంది అధికారుల సహకారంతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మళ్లీ కబ్జాకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పబ్లిక్ ప్రాపర్టీలో నాటిన హెచ్చరిక బోర్డును కబ్జాదారులు తొలగించినా వారిపై చర్యలు తీసుకోవడంలో కార్యదర్శి విఫలమవుతున్నారని మండిపడ్డారు. 2024 ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రస్తుత ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఈ విషయంపై వినతిపత్రం అందజేసినట్లు గుర్తుచేశారు. పబ్లిక్ ప్రాపర్టీని అభివృ ద్ధి చేసి ప్రజలకు అందజేస్తామని అప్పట్లో సోమిరెడ్డి స్థానికులకు హామీని ఇచ్చారని ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకుని రూ.3కోట్ల విలువైన పబ్లిక్ ప్రాపర్టీని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

C.R.I.M.E N.E.W.S

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం



హైవేపై బైక్, వెంకటరమణయ్య మృతదేహం

కోవూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై ఉన్న సాయిబాబా గుడి సమీపంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శుక్రవారం ఉదయం లారీ ఢీకొనడంతో కొడవలూరు మండలంలోని మానేగుంటపాడుకు చెందిన కాకుమూడి వెంకటరమణయ్య (41)మరణించాడు. ఈయన ప్రతిరోజూ నీటిబోర్లు వేసే కూలీ పనులకు వెళ్తుంటాడు. అందులో భాగంగా కూలీ పనికోసం ఆయన ఇంటి వద్ద నుంచి మోటారు బైక్‌పై వేకువనే నెల్లూరుకు బయలుదేరాడు. నగరంలోని హరనాథపురంలో పనిముగిం చుకుని తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ, డ్రైవర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాల్టీ పరిధిలోని నాగేంద్రపురం సమీపంలోని రైస్‌మిల్లులో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం దేపూరు గ్రామానికి చెందిన నూరుల్లా (28)కి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. అతనికి పిల్లలు లేరు. నూరుల్లా శుక్రవారం ఉదయం దేపూరు గ్రామం నుంచి ఆటోలో వడ్ల లోడు చేసుకుని రైస్‌మిల్లుకు చేరుకున్నాడు. రైస్‌మిల్లు అప్పటికి తెరవకపోవడంతో యజమానికి ఫోన్‌చేసి బహిర్భూమికెళ్లాడు. అనంతరం ఏమి జరిగిందో ఏమోగాని సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా మారాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మద్యానికి బానిసై కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకున్నట్లు తెలుస్తోందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్‌ఐ షేక్ జిలాని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 20న ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు... నగరంలోని అల్లీపురానికి చెందిన వెంకట రమణయ్య (47) తన భార్యతో ఏర్పడిన వివాదం కారణంగా మద్యంలో గడ్డిమందు కలుపుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే అతనిని వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు



బోల్తాపడ్డ ఆటో

ఏఎస్ పేట, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన చిరమన గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి ఏఎస్ పేటకు వస్తున్న ఆటో చిరమన గ్రామం మలుపు వద్దకు రాగానే మదారాబాదు గ్రామం నుంచి ఏఎస్ పేటకు వస్తున్న బైక్ ఎదురుగా రావడంతో తప్పించబోయి అదుపు తప్పి ఆటో, బైక్ బోల్తా పడ్డాయి. దీంతో ఆటోలోని మహిళకు, బైక్‌పైన వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం 108లో ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ

● లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

● రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



ఘటనాస్థలిలో ఆయిల్ ట్యాంకర్, లారీ

వెంకటాచలం, మే 2 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని సర్వేపల్లి క్రాస్ రోడ్డులోని జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి ఆయిల్ ట్యాంకర్‌ను లారీ ఢీకొన్నది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో లారీ డ్రైవర్ ఇరుక్కుపోవడంతో స్థానికులు, పోలీసులు కలిసి బయటకు తీశారు. ఆయిల్ ట్యాంకర్‌లోని వారికి స్వల్పగాయాల య్యాయి. సర్వేపల్లి నుంచి నెల్లూరు వైపు ఆయిల్ ట్యాంకర్.. నెల్లూరు నుంచి గూడూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రహదారిపై ఉన్న ట్యాంకర్‌తో పాటు లారీను క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు. అనంతరం రహదారిపై నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు పునరుద్ధ రించారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

నంగం, మే 2 (ఆంధ్రజ్యోతి):అన్నారెడ్డిపాళెంలో ఓ రైతు పల్లంగా ఉన్న తన పొలంలోకి సమీప పొలాలలో ఉన్న మెరక మట్టిని తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు దాడిచేశారు. రెండు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటరును స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	122
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 460



కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకారం : జడ్జి వాణి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు ఎలాంటి ఇబ్బందులున్నా పరిష్కరించేందుకు తాము ముందుటామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే వాణి తెలిపారు. మేడే వారోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరపురంలో ఉన్న విజయ పాల డెయిరీలో కార్మికుల కోసం శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్మికులకు అందుతున్న సౌకర్యాలు, జీతాలు, పనిగంటలు తదితర వివరాలను జడ్జి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ ఎండీ వీసీ కృష్ణమోహన్, మేనేజర్ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి వేదగిరి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి లక్ష్మీనృసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 6 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. వీటికి సంబంధించిన పోస్టర్లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శుక్రవారం ఆయన కార్యాలయంలో విడుదల చేశారు. అన్నీ శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ ఛైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో వేమూరి గోపి, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయ రూరల్ ఇన్‌చార్జిగా సురేంద్రరెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్ మండలానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కార్యాలయ ఇన్‌చార్జిగా వేదగిరి క్షేత్రం మాజీ ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డిని నియమిస్తూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జిగా చాట్ల చక్రవర్ధన్ రెడ్డిని నియమించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీఐ దశరాథరామారావు

నెల్లూరు (వైద్యం), మే 2 (ఆంధ్రజ్యోతి) : హోల్ సేల్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని దేవిరెడ్డి వారి వీధిలో శుక్రవారం మజ్జిగ చలి వేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని సీఐ దశరథ రామారావు ప్రారంభిం చారు. అసోసియేషన్ అధ్యక్షకార్య దర్శులు అశోక్‌కుమార్, వెంకటే శ్వర్లు, కోశాధికారి లీలామోహన్ తదితరులు పాల్గొన్నారు.

కోటమిట్టలో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కోటమిట్ట ప్రాంతంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారుల సమాచారం మేరకు... కోటమిట్ట ప్రాంతంలోని దర్గా వద్ద ఎండీ షారుఖ్ రెండు అంతస్థుల భవనం నివసిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏసీ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. వాటిని గమనించిన ఇంట్లోని వారు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు పేర్కొన్నారు.

రోడ్డు మధ్యలో కుర్చీ



నెల్లూరు(క్రైం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట బీవీఎస్ స్కూలు సమీపంలో రోడ్డుపై ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరం నుంచి నవాబుపేట, రాజుపాలెం, నరుకూరు, ఇందుకూరుపేట ప్రాంతాల వైపు నిత్యం వేలాది మంది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మధ్యలో గుంత ఉండటంతో వేగంగా వస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోజుల తరబడి ఇలాగే ఉన్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికంగా ఉన్న దుకాణదారులు రోడ్డుపై గుంత వద్ద కుర్చీని గుర్తుగా ఏర్పాటు చేశారు. వాహనదారుల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేశారు. అయితే గుంత విషయం తెలియని వారు 'ఇదేందయ్యా రోడ్డు మధ్యలో కుర్చీవేశారు' అనుకుంటూ ముందుకు సాగుతున్నారు.

గిరిజన బాలికల గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

ఉలవపాడు, మే 2(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడులో ఉన్న గిరిజన బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.వెంకటసుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మొత్తం 192 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎస్టీ గురుకులం కావడంతో 4 నుంచి 9వ తరగతి వరకు ఏర్పడిన ఖాళీలు ఎస్టీ విద్యార్థులతోనే భర్తీ చేయాల్సి ఉన్నందున ఎస్టీలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పండ్ల మార్కెట్ రెడీ!

రాజకీయపరమైన అవాంతరాలు.. రెండు వ్యాపార వర్గాల మధ్య బలప్రదర్శనలు.. కోర్టు వివాదాలు... వీటన్నింటినీ దాటుకుని ఎట్టకేలకు నగరంలో పండ్ల మార్కెట్ ప్రారంభానికి సిద్ధమైంది. నిర్మాణం జరిగిన 11 ఏళ్ల తర్వాత అడ్డంకులన్నీ తొలగిపోవడంతో అతి త్వరలో ఫ్రూట్ బజార్‌ను ప్రారంభించడానికి యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. దీని ద్వారా మార్కెటింగ్ శాఖకు ఏడాదికి దాదాపుగా రూ.40లక్షల వరకు ఆదాయం సమకూరనుంది. సమస్యలన్నీ పరిష్కారమై, పండ్ల మార్కెట్ పట్టాలెక్కడం వెనుక కీలకంగా వ్యవహరించిన నెల్లూరు వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎం శ్రీనివాసులు అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

- ఎట్టకేలకు తొలగిన అడ్డంకులు • త్వరలో ప్రారంభం
- ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసులు చొరవ
- 126 దుకాణాల కేటాయింపు పూర్తి
- ఏడాదికి రూ.40లక్షల వరకు ఆదాయం



కోనేరు స్థలంలో సిద్ధమైన పండ్ల దుకాణాలు (ఇన్‌సెట్) వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న బోర్డులు

నెల్లూరు(వ్యవసాయం), మే 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ప్రధాన కూరగాయల మార్కెట్ అయిన ఏసీ సుబ్బారెడ్డి మార్కెట్ పక్కనే కోనేరు స్థలంలో కొన్నేళ్ల క్రితం ఓపెన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. రైతులు, పల్లెల నుంచి బుట్టల్లో కూరగాయలు తెచ్చుకుని వారు ఇక్కడ అమ్మకాలు సాగిస్తుంటారు. చిన్న బజారులో ఉన్న పండ్ల మార్కెట్‌ను కూడా ఇక్కడకు తీసుకురావాలని అప్పటి రాజకీయ నాయకులు భావిం చారు. చిన్న బజారులో ఇరుకు రోడ్డు, ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో వాహనాల రాకపోకలతో ఇబ్బందులు లేకుండా ప్రధాన మార్కెట్ పక్కనే అందుబాటులో ఉండేలా ఫ్రూట్ మార్కెట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా 11ఏళ్ల క్రితం సుమారు రూ.70 లక్షలతో పండ్ల వ్యాపారుల కోసం 126 దుకాణాలు నిర్మించారు. అయితే దుకాణాల కేటాయింపు సమయంలో రాజకీయపరమైన సమస్యలు, రెండు పండ్ల వ్యాపార సంఘాల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో మార్కెట్ ప్రారంభానికి అవాంతరాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత మార్కెట్ కమిటీ కార్యదర్శులుగా ఎంతో మంది పనిచేసినా పండ్ల మార్కెట్ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. కోర్టు చిక్కుల నేపథ్యంలో కనీసం దానిపై మాట్లాడే సాహసం కూడా చేయలేదు.

మౌలిక వసతుల ఏర్పాటు చేస్తున్నాం



పండ్ల వ్యాపారులకు దుకా ణాల కేటాయింపు పూర్త యింది. నా హయాంలో సమ స్య పరిష్కారం కావడం సంతోషంగా ఉంది. ఫ్రూట్ మార్కెట్ సముదా యంలో దాదాపు రూ.14.32లక్షలతో సెంట్రల్ లైటింగ్, 166 కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. తాగునీటికి ఆర్వో ప్లాంటు, 10 మరుగుదొడ్లు అవసరం. దూర ప్రాంత రైతులు రాత్రి సేద తీరేందుకు ఒక హాల్ కూడా ఏర్పాటు చేస్తున్నాం.

- ఎం శ్రీనివాసులు, నెల్లూరు ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి

• ఉన్నతశ్రేణి కార్యదర్శి చొరవతోనే..

నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా ఎం శ్రీనివాసులు గతేడాది బాధ్యతలు చేపట్టారు. పండ్ల మార్కెట్ అంశంపై ఆ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించారు. కోర్టుకు అవసరమైన పత్రాలు, సమాధానాలు సమర్పించడంతో ఉపశమనం లభించింది. అదే సమయంలో జిల్లా నాయకులు, ఉన్నతాధికారులను సంప్రదించి రాజకీయపరమైన సమస్యలనూ అధిగమించారు. దుకాణాల కేటాయింపునకు సంబంధించి మొదటి విడత బహిరంగ వేలం పాటలో ఓ వర్గం పండ్ల వ్యాపారి దురుసుగా వ్యవహరించినా సంయమనం కోల్పోలేదు. అర్హులకు దుకాణాలు ఇవ్వడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో ఆ వర్గానికి చెందిన కొందరు వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సులు ఇప్పించడంతో వారు కూడా వేలంలో పాల్గొని దుకాణాలు దక్కించుకు న్నారు. చివరకు నోరుపారేసుకున్న వ్యక్తి కూడా మార్కెట్ కమిటీ కార్యదర్శికి ధన్యవాదాలు చెప్ప డం కొసమెరుపు.

• ఏఎంసీకి రూ.4.4కోట్ల నష్టం

దుకాణాల నిర్మాణం అనంతరం కోర్టు వివాదాల కారణంగా పండ్ల మార్కెట్ ప్రారంభానికి అడ్డుకట్ట పడింది. అన్నీ సవ్యంగా జరిగి అప్పట్లోనే మార్కెట్ మొదలై ఉంటే ఒక్కో వ్యాపారి నుంచి దుకాణాన్ని బట్టి రూ.1500, రూ.1800, రూ.2500, రూ.3500ల వరకు అద్దె రూపంలో నెల్లూరు వ్యవసాయ మార్కెట్‌కు ఆదాయం అందేది. ఈ విధంగా మొత్తం 126 దుకాణాలకు నుంచి ఏడాదికి దాదాపుగా రూ.40లక్షల వరకు ఆదాయం వచ్చేదని మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. ఈలెక్కన గత 11ఏళ్లకు దాదాపు రూ.4.4కోట్లను ఆ శాఖ నష్టపోయింది.

సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు భూమి పూజ

నెల్లూరు (వైద్యం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 47వ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులకు టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గణేష్ కుమార్, ఖాదర్ బాషా, భాస్కర్, ఫిరోజ్, అలేఖ్య, రత్నమ్మ, లక్ష్మీ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తా

• రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగర శివార్లలోని అక్క చెరువుపాడు వద్దనున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం టిడ్కో సము దాయం వద్దకు వెళ్లిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. తాగునీరు, లైట్లు, పారిశుధ్యం, డ్రైనేజీ వంటి సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి

నెల్లూరు (వైద్యం, ఆంధ్రజ్యోతి) : కోటమిట్టలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాద బాధితులకు నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అండగా నిలిచారు. ప్రమాద విషయం తెలుసుకుని బాధితుడు ఫరూక్ కుటుంబానికి రూ.10వేల సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని తహసీల్దారును కోరారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఎస్డీ మెయినుద్దీన్, జాఫర్ మొయినుద్దీన్, కాలేషా పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇరగాళమ్మ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ శాంతి నగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతినగర్, బట్వాడిపాలెం సెంటర్, రామయ్యబడి వీధి, ఏసీబీ ఆఫీస్, రాజావారి వీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● డైకస్ రోడ్డు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రహ్మణ వీధి, ఫతేఖాన్‌పేట, రమేష్ రెడ్డి నగర్, పెద్ద బజార్, చిన్న బజార్, కలెక్టరేట్, ఆచారి వీధి, పెద్ద పోస్టాఫీసు ఏరి యా, మధ్వపతి వారి వీధి పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

● ఏకే నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని టూరిజం ఫీడర్‌లో మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. మెయిన్‌రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, జడ్జి క్వార్టర్స్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాల ని కోరారు.

ఆర్‌ఆర్‌ఆర్ అవెంజర్స్ సెట్టింగ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మాజీ మేయర్ భానుశ్రీ

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వైఎంసీఏ మైదానంలో ఆర్‌ఆర్‌ఆర్ అవెంజర్స్ సెట్టింగ్‌తో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ అతిథిగా హాజరై ఈ ప్రదర్శనను ప్రారంభించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకుడు ఎస్‌కే బాబు మాట్లాడుతూ వేసవి వినోదం కోసం ప్రత్యేక సెట్టింగ్‌తో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని సెట్టింగ్ ప్రత్యేకం అన్నారు. చిన్నారులు, మహిళల వినోదం కోసం జెయింట్‌వీల్, మేరీ కొలంబస్, డ్రాగన్ ట్రైన్, కప్‌సాసర్, టోరా టోరా, బేబీ ట్రైన్, చిల్డ్రన్స్ వాటర్ బోటింగ్ వంటి రైడర్స్ ఎన్నో ఉన్నాయని చెప్పారు. నోరూరించే ఫుడ్ కోర్టు, గృహోపకరణ వస్తువులు, దేశం నలుమూలల నుంచి వచ్చిన ఉత్పత్తులతో స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎగ్జిబిషన్ ప్రతీ రోజూ సాయంత్రం 4గ నుంచి రాత్రి 10గంటల వరకు ఉంటుందని తెలిపారు.

చైతన్యపురి కాలనీలో 'కిశోరీ బాలికల వికాసం'

నెల్లూరు (హరనాథపురం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని చైతన్యపురి కాలనీలో ఐసీడీఎస్, మహిళా పోలీసుల ఆధ్వర్యంలో కిశోరీ బాలికల వికాస కార్యక్రమం శుక్రవారం జరిగింది. కిశోరీ బాలికల సాధికారత - మనందరి బాధ్యత అనే అంశంపై చర్చ జరిగింది. సచివాలయం అడ్మిన్ కోటి, వీఆర్‌వో ప్రమీల, ఏఎన్ఎం శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు కుమారి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలను ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు

• కమిషనర్ నందన్



పంట కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకం కలిగించే విధంగా పంట కాలువలను ఆక్రమిస్తే ఉపేక్షించవద్దని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. శుక్రవారం 30వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కాలువలను ఆక్రమిస్తే సిటీప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డైకస్ రోడ్డులోని అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను పరిశీలిం చారు. కార్పొరేషన్ ఖాళీ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. ఆ తర్వాత కార్యాలయంలో వివిధ విభాగాల అధిపతులు, జూనియర్, సీనియర్ సహాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచన చేశారు.

ఆదిశంకరులకు వసంతోత్సవం

- భక్తిశ్రద్ధలతో జగద్గురు జయంతి • సామూహిక ఉపనయనాలు



మూలస్థానేశ్వరాలయంలో ఆదిశంకరాచార్యుల అలంకరణ

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 (ఆంధ్రజ్యోతి) : జగద్గురువు ఆదిశంకరా చార్యుల జయంతి సందర్భంగా నగరంలోని మూలాపేట మూల స్థానేశ్వరాలయంలో శుక్రవారం వసంతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈనెల 10వతేదీ వరకు జరుగుతాయి. తొలిరోజు చతుర్వేదం పారాయణం జరిగింది. ఈవో ఏవీ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

రాజరాజేశ్వరి ఆలయంలో...

నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదిశంకరాచార్యులు జయంతిని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి, అర్చకులు, భక్తులు ఆదిశంకరులకు పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం వేద పారాయణం, పద్మశ్రీ ఘంటసాల కళానికేతన్ వారి భక్తిరంజనీ కార్యక్రమం, రాత్రి 7.30 గంటలకు కుంభ హారతులు, పల్లకీసేవ జరిగాయి.

సామూహిక ఉపనయనంలు

శంకర జయంతి సంద ర్భంగా వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో సామూహిక ఉపనయనాలు జరిగాయి. పురోహితుడు మన్నూరు నాగరాజశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఎఫ్‌సీఐ కాలనీలోని శ్రీనివాస కల్యాణ నిలయంలోనూ సామూహిక ఉపన యనాలు జరిగాయి. ఈ కార్యక్రమం తుమ్మగుంట బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. అరవిత్తూరు గణపతి శాస్త్రి, మాచవోలు కోటేశ్వర శర్మ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాచవోలు శివరామకృష్ణ, భట్టారం శ్రీనివాస శాస్త్రిలకు సన్మానం జరిగింది. పాటూరు రామశేషయ్య, బీఎల్‌వీ సుబ్రహ్మణ్యం, సుబ్బు శ్రీనివాసులు, వైద్యనాథ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



త్యాగరాజస్వామి మందిరంలో సామూహిక ఉపనయనాలు

ఉడయవర్లు దేవస్థానంలో తిరునక్షత్ర వేడుకలు



మాగుంట లేఅవుట్ వేంకటేశ్వర ఆలయంలో ఆళ్వార్లకు అభిషేకం

నెల్లూరు (సాంస్కృతికం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబు పేట ఉడయవర్లు దేవస్థానంలో భగవద్రామానుజాచా ర్యుల 1008వ జన్మ తిరునక్షత్ర వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు, ఉత్సవం జరిగాయి.

● మాగుంట లే అవుట్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్రామానుజాచార్యుల జయంతి వేడుకలు జరిగాయి. ఆళ్వారులకు అభిషేకాలు, పూజలు చేశారు.

సమరసతా వేదిక నివాళి

విశిష్ట అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవద్రామానుజాచార్యులకు సమరసతా వేదిక నివాళి అర్పించింది. తల్పగిరి రంగనాథస్వామి ఆలయం ఎదుట భగవద్రామానుజాచార్యుల విగ్రహానికి పుష్పమాలలు వేసి వారి బోధనలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జయప్రకాష్, మామిడి శ్రీని వాసులు, రావు పోలయ్య, సతీష్, సుబ్బారావు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల దుష్ఫలితాలపై పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(క్రైం), మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈఎస్ శ్రీనివాసులు నాయుడు సమక్షంలో శుక్రవారం ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుష్ఫలితాలపై అవగాహన కల్పించే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈఎస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల దుష్ఫలితాల గురించి తెలియక వాటికి బానిసలుగా మారిన యువత, నిరుపేదలు, అమాయకులకు వాటిపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఈగల్ టీమ్‌ను ఏర్పాటు చేసిందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ ఆర్ జగదీశ్వర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వై వెంకటేశ్వర్లు, ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు మొగిలిచర్లలో దత్తాత్రేయస్వామి ఆరాధన

లింగసముద్రం, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగిలిచెర్ల గ్రామ సమీపంలోని మన్నేరు ఒడ్డున వెలసియున్న దత్తాత్రేయ స్వామి ఆరాధన ఈనెల 4వ తేదీన జరగనుంది. ఈ ఆరాధన మహోత్సవానికి ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. స్వామి వారిని భక్తులు సందర్శించేందుకు వీలుగా బ్యారికేడ్లు, సిబ్బందిని ఏర్పాటు చేశారు. భక్తులకు మంచినీరు, మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేసినట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు. రాత్రి పండరి భజన, హరిశ్చంద్ర నాటక ప్రదర్శన, అగ్నిగుండం ప్రవేశం జరుగుతుందన్నారు. ఆరాధన ముందు రోజైన శనివారం సాయంత్రం దత్తమాల ధరించిన సుమారు వెయ్యి మందికి పైగా మాలాధారులు మొగిలిచెర్ల గ్రామంలోని రామాలయం వద్ద స్వామి వారికి పూజలు నిర్వహించి అనంతరం కళశాలతో ఊరేగింపుగా దత్తాత్రే స్వామి ఆలయం వద్దకు వచ్చి స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారిన, రాత్రికి అక్కడే ఉండి ఆరాధన మహోత్సవం రోజున పూజలు చేసి 5న పొంగళ్లు పెట్టుకొని, దీక్ష విరమిస్తారని పవని ప్రసాద్ చెప్పారు.

ప్రసన్నుడి ఆలయ మహా ప్రాకారానికి హద్దులు

బిట్రగుంట, మే 2(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ మహాప్రాకార నిర్మాణానికి కావలి డివిజనల్ సర్వేరు శ్రీనివాసులు శుక్రవారం హద్దులు ఏర్పాటు చేశారు. ఆలయానికి మహాప్రాకారం ఏర్పాటు చేయాలన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి సూచనల మేరకు ఆలయ మాజీ పాలక మండలి ఛైర్మన్ శ్రీరాం మాల్యాద్రి సర్వేర్లతో కొండ దిగువన చుట్టుకొలతలు తీయించారు. గిరిప్రదక్షిణ రోడ్డుకు ఆటంకం కలుగకుండా ఆలయ నాలుగు మూలల హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేరు వెంకటేశ్వర్లు, విశ్రాంత ఇంజినీరు గోపీకృష్ణ, స్థానికులు, గ్రామ సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

కిలో పొగాకు రూ.280

కలిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 397 బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 301 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-73, ఆర్‌ఆర్-2, సీఆర్-18, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 96 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.250.11గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి ఇస్సాక్‌స్వరన్‌దత్ తెలిపారు.






అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభ వేడుకకు హాజరైన ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ - సభలో చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి - మంత్రులతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు - సభాస్థలి వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, విజయశ్రీ ,సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, పులివర్తి నాని, కురుగొండ్ల రామకృష్ణ, మురళీమోహన్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మాజీ మంత్రి పరసా రత్నం తదితరులు



ఆలయంలో ఉగ్రవాదిని హతమార్చి..




నిచ్చెన ద్వారా లోపలకు వచ్చిన భద్రతా దళాలు - అటవీమార్గం గుండా ఆలయం వైపు వస్తూ..

ఉగ్రవాదులు ఆలయంలోకి వస్తే..

● తిరుపతి కపిలతీర్థంలో భద్రతా దళాల మాక్ డ్రిల్

ప్రముఖ ఆలయాల్లోకి ఉగ్రవాదులు ప్రవేశిస్తే.. భక్తులను అడ్డం పెట్టుకుని విధ్వంసానికి ప్రణాళిక రచిస్తే.. వారిని ఎలా ఎదుర్కోవాలి? భక్తులను ఎలా కాపాడాలి? ఈ దిశగా తిరుపతి నగరం కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో ఆక్టోపస్ దళాలు శుక్రవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో.. ఆక్టోపస్ అదనపు ఎస్పీ సి.రాజారెడ్డి, డీఎస్పీ మధుసూదనరావు నేతృత్వంలో దాదాపు మూడు గంటలపాటు ఈ మాక్ డ్రిల్ జరిగింది. జిల్లా అటవీశాఖ కార్యాలయ ప్రాంగణం నుంచి ఆక్టోపస్ బలగాలు మూడు గ్రూపులుగా విడిపోయి వ్యూహాత్మకంగా ఆలయంలోకి ప్రవేశించారు. చెట్ల చాటుగా ఆలయంలోకి వెళ్లిన భద్రతా దళాలు ఉగ్రవాదులను హతమార్చాయి. మరోవైపు ఆలయమంతటా జల్లెడ పడుతూ భక్తులను రక్షించేలా మాక్‌డ్రిల్ జరిగింది. ఎక్కడైనా బాంబులు పెట్టారా? పెడితే నిర్వీర్యం చేసేలా బాంబు స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఉగ్రవాదులు ఆలయాల్లోకి చొరబడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా డెమోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ సీఐలు, 40 మంది కమాండోలు, 10 మంది టీటీడీ విజిలెన్సు సిబ్బంది, పోలీసులు, రిజర్వు బలగాలు, మెడికల్ సిబ్బంది, ఎలక్ట్రికల్, వాటర్‌గ్యాస్, బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.


- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



ఫెన్సింగ్ దాటుకుంటూ..



భక్తులను కాపాడుతూ, ఉగ్రవాదులకు గురిపెట్టి



ఆలయం లోపల అప్రమత్తంగా..

● బ్యాక్ టూ బర్డ్

బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్



● సీఎం సూచనలతో టీటీడీ ఉత్తర్వులు

తిరుపతి, మే2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ గుడారు జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు గత నెల 2న అమరావతిలో టీటీడీపై సమీక్షించిన సందర్భంలో డాక్టర్ జగదీష్‌ను బర్డ్ డైరెక్టర్‌గా నియమించాలని సూచించారు. ఆమేరకు ఇటీవల జరిగిన టీటీడీ పాలకమండలిలో నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఏడాదిపాటు కాంట్రాక్ట్ పద్ధతిన డైరెక్టర్‌గా నియమిస్తూ నెలకు రూ.2లక్షల వేతనం, వాహనం, ఇతర సౌకర్యాలను కల్పిస్తూ ఈవో ఉత్తర్వులు ఇచ్చారు.

అవమానించిన చోటే.. : 1992లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బర్డ్‌లో చేరిన డాక్టర్ జగదీష్ ఏడాదికే ఇన్‌చార్జి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మూడేళ్ల తర్వాత పూర్తిస్థాయి డైరెక్టర్ అయ్యారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్ కొనసాగారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన్ను డైరెక్టర్ బాధ్యతలనుంచి తప్పించారు. విచారణ అంటూ హడావుడి చేసి అవమానించారు. అప్పటినుంచి ద్వారక తిరుమలలోని 'విర్డ్' ట్రస్ట్ ఆస్పత్రి డైరెక్టర్‌గా కొంతకాలం పనిచేస్తూనే బర్డ్‌కు అలవాటైన రోగులకోసం ప్రతి వారం రాస్ బిల్డింగ్‌లో ఉచిత ఓపీలు చూసేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక తిరిగి బర్డ్ డైరెక్టర్‌గా నియమితులవ్వడం గమనార్హం.

ఒకప్పటి బర్డ్‌లా లేదు... : బర్డ్.. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ఆర్థోపెడిక్ ఆస్పత్రి. మూడున్నర దశాబ్దాలుగా లక్షలాది మంది జీవితాలలో వెలుగులు నింపిన దవాఖానా. గత వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలు, సంస్థలను నాశనం చేసినట్టే తిరుపతిలోని బర్డ్‌నూ భ్రష్టు పట్టించింది. బర్డ్ ఆస్పత్రి 350 పడకల సామర్థ్యంతో, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 700కు పైగా అవుట్ పేషంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులు ఉన్నాయి. అత్యవసర వైద్యంలో భాగంగా 6 అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 20 వరకు శస్త్ర చికిత్సలు జరిగే సౌలభ్యం ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆపరేషన్ల సంఖ్య దారుణంగా పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం 5 గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది.

బర్డ్‌కు పూర్వ వైభవం తెస్తా: జగదీష్

బర్డ్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని నూతనంగా నియమితులైన డైరెక్టర్ జగదీష్ తెలిపారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. 30 ఏళ్లపాటు పనిచేసిన అనుభవంతో బర్డ్‌ను ఏవిధంగా గాడిలో పెట్టాలో తగిన ప్రణాళికలు ఉన్నాయన్నారు. బర్డ్‌కున్న జాతీయ స్థాయి గుర్తింపు దృష్ట్యా వైద్యసేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు నాయుడికి, కూటమి పెద్దలకు, టీటీడీ పాలకమండలికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీపీఎస్సీ గ్రూప్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), మే 2(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్స్-1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్షలు శనివారం నుంచి 9వ తేదీ వరకు జరగున్నాయి. ఈ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్వో నరసింహులు అధికారులు, ఇన్విజిలేటర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని 911మందికి తిరుపతి నగరం న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాల, యశోద నగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, ప్రకాశం భవన్‌లోని ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాలను కేంద్రాలుగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సీసీకెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతాయన్నారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ(మానిటర్) వెంకటలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్లు సునీత, శివన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశిపెంట్ల వద్ద కారు బోల్తా

● తాతా మనవళ్ల దుర్మరణం, మరో ముగ్గురికి గాయాలు



కాశిపెంట్ల వద్ద బోల్తాపడిన కారు




మృతి చెందిన నూతన్, కరేగౌడ్

చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తాతా మనవడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు సమీపంలోని లగేరి గ్రామానికి చెందిన మంజునాథ్, భార్య సౌమ్య, కుమారుడు నూతన్(6), అత్తమామలు దొడ్డమ్మ, కరేగౌడ(64), శుక్రవారం తెల్లవారు జామున శ్రీవారి దర్శనానికి కారులో బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో కాశిపెంట్లకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కరేగౌడ్, నూతన్‌కు తీవ్రంగాను.. మంజునాథ్, సౌమ్య, దొడ్డమ్మకూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే కరేగౌడ్, నూతన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవింగ్ చేస్తున్న మంజునాథ్ తన ముందు వెళుతున్న కారును అధిగమించబోయి ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు.




గాయపడిన సౌమ్య, దొడ్డమ్మ

పిడుగుపాటుకు రైతు మృతి



ఎర్రావారిపాలెం, మే 2 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యాన్ని కళ్లంబండ మీద ఆర పెడుతున్న రైతు.. పిడుగుపాటుకు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రావారిపాలెం మండలం బోడేవాండ్లపల్లె పంచాయతీ వడ్డిపల్లెకు చెందిన కోటకొండ భారతి, రమణ దంపతులు రెండు రోజుల కిందట వరి కోత కోశారు. ఊరికి దగ్గరలోని కళ్లం బండ మీద ధాన్యాన్ని శుక్రవారం ఆర బెట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వర్షం వస్తుండడంతో ధాన్యాన్ని కుప్పతోసి టార్పాలిన్ పట్ట కప్పారు. ఈదురు గాలికి పట్ట పైకి లేవకుండా రాయి తీసుకొచ్చి పెట్టేందుకు అక్కడ్నుంచి 50 అడుగుల దూరం వెళ్లారు. అదే సమయంలో.. అక్కడ పిడుగు పడటంతో రమణ కుప్పకూలారు. దగ్గరలో ఉన్న ఆయన భార్య భారతి షాక్‌కు గురై స్పృహ తప్పారు. అక్కడే కళ్లంలో పొరుగు రైతు రమణ వద్దకు వెళ్లి చూడగా అప్పటికే విగతజీవిగా పడిపోయి ఉన్నారు. భారతిని ఇంటికి చేర్చిన స్థానికులు, రమణ మృతి విషయాన్ని బంధువులకు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి రూ.11.30 కోట్లు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి రూ.11.30 కోట్ల నాబార్డు నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని 39.4 కిలోమీటర్ల నిడివితో 12 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు.

● గూడూరు-జయంపు రోడ్డు, కొర్నగుంట-నెర్నూరు రోడ్డు, చెన్నూరు-పాలిచెర్ల రాజుపాలెం రోడ్డు, ఉడతవారిపాలెం-ఆర్‌ఎల్‌ఎస్ రోడ్లకు (13.8 కిలోమీటర్లు) రూ.3.50 కోట్లు కేటాయించారు.

● సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బీ పరిధిలో పాత మద్రాసు-కలకత్తా రోడ్డు (103-105 కిలోమీటర్ల నడుమ), సూళ్ళూరుపేటలో పాత మద్రాసు-కలకత్తా రోడ్డు (77-79 కిలోమీటర్ల నడుమ), కొండూరు నుంచీ మాంబట్టు మీదుగా కాదలూరు రోడ్డు (6.8 కిలోమీటర్ల నిడివి) అభివృద్ధికి రూ.2.50 కోట్లు కేటాయించారు.

● సత్యవేడు నియోజకవర్గంలో వీఆర్ కండ్రిగ-టీపీ పాలెం రోడ్డు, కావర్‌పేట-సత్యవేడు రోడ్డు (7.8 కిలోమీటర్లు)కు రూ.2 కోట్లు కేటాయించారు.

● చంద్రగిరి నియోజకవర్గంలో పాకాల-కొత్తకోట రోడ్డు, ఎన్‌హెచ్-205 నుంచి వంకమద్దివారిపల్లి, టి.చట్టేవారిపల్లి, చట్టేవారిపల్లిల మీదుగా భాకరాపేట-ఎర్రావారిపాలెం రోడ్డును కలిపేందుకు (మొత్తం 11 కిలోమీటర్ల నిడివి) రూ.3.30 కోట్లు కేటాయించారు.

రేపటినుంచి ముక్కంటికి ధారా పాత్ర ఏర్పాటు

శ్రీకాళహస్తి, మే 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామికి ఆదివారం నుంచి 28వ తేదీ వరకు ధారాపాత్ర ఏర్పాటు చేయనున్నట్లు ఈవో బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైశాఖ శుద్ధ సప్తమి ఆదివారం డొల్లు కత్తెర ప్రారంభం అవుతన్న నేపథ్యంలో రెండవ కాల అభిషేకం అనంతరం స్వామివారి మూలవిరాట్ పైభాగాన ధారాపాత్ర ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. ఏటా మండు వేసవిలో వచ్చే డొల్లకర్తరీ, నిజకర్తరీ సందర్భంగా స్వామివారిపై నిత్యం పచ్చకర్పూర జలం ధారగా పడేలా ఈ పాత్ర ఏర్పాటు చేస్తారని తెలిపారు.

తాతయ్యగుంట గంగజాతరకు 15 మందితో కమిటీ

తిరుపతి(కలెక్టరేట్), మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 6 నుంచి 14వ తేదీ వరకు జరిగే తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని 15మందితో కలెక్టర్ వెంకటేశ్వర్ కమిటీ ఏర్పాటు చేశారు. రాయలసీమలోనే తిరపతి జాతర ప్రసిద్ధి చెందింది. గంగమ్మ గుడికి పాలకవర్గం ఏర్పాటు కాలేదు. ఈ క్రమంలో జాతర ఏర్పాట్లు, భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు కమిటీని నియమించారు. ఇందులో తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీటీడీ సభ్యులు పనబాక లక్ష్మి, భానుప్రకాష్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, జనసేన, బీజేపీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, సామంచి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, టీడీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ మబ్బు దేవనారాయణరెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళి, తాతయ్యగుంట ఆలయ మాజీ చైర్మన్ చింతా భరణియాదవ్, టీడీపీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్ సభ్యులుగా ఉంటారు.




శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర

తిరుమల, మే2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో శుక్రవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా జరిగింది. రామానుజులు జన్మించిన వైశాఖ మాస అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం భాష్యకార్లను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. తర్వాత నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి ఒక తిరుచ్చిపై, భాష్యకార్లను మరో తిరుచ్చిపై ఊరేగించారు. అనంతరం ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. రాత్రి భాష్యకార్ల సన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు. ప్రత్యేక ఆభరణాలతో సళ్లింపు చేయడంతో కార్యక్రమం ముగిసింది జీయర్‌స్వాములు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎ‌స్‌డీవోగా బాలాజీ

తిరుపతి(క్రీడలు), మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఇన్‌చార్జి డీఎస్‌డీవోగా ఎ.బాలాజీ నియమితులయ్యారు. ఇప్పటి వరకు కొనసాగిన సయ్యద్‌సాహెబ్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ శాప్ ఎండీ గిరీష ఉత్తర్వులు జారీచేశారు.

శ్రీవారి సర్వదర్శనానికి 17 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.04 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 57,863


తలనీలాలు సమర్పించినవారు: 31,030

నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేయనున్నట్టు డీఆర్వో నరసింహులు తెలిపారు. దీనికోసం నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, సిబ్బంది సకాలంలో ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్నారు. 'నియోజకవర్గాల అభివృద్ధి- స్వర్ణాంధ్ర 2047' సాధనలో భాగంగా పద్మావతి మహిళా యూనివర్సిటీలోని సావేరీ హాలులో శుక్రవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాలు అభివృద్ధి చెందితే జిల్లా, జిల్లాలు అభివృద్ధి చెందడం ద్వారా రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతాయన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి, సకాలంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేలా అందరూ కృషి చేయాలని ఏపీ సెక్రటేరియట్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ రాంబాబు సూచించారు. ప్రతి వ్యక్తి ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని ప్రణాళిక శాఖ సలహాదారు సీతాపతిరావు కోరారు. ప్రతి కుటుంబం ఒక పరిశ్రమలాగా రూపొంది, వృత్తి నైపుణ్యాల ద్వారా ఆర్థికాభివృద్ధిని సాధించేందుకు తోడ్పాటును అందించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యక్తికీ, ప్రతి రంగంలో, ప్రతి పనిలో అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. ఎమ్మెల్యేలతో సంప్రదించి నియోజకవర్గ ప్లాన్‌ను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలకు చెందిన నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, జిల్లా గణాంకాధికారి ప్రేమచంద్ర, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆలయం ముందు భక్తులు

తిరుమలలో కొనసాగుతున్న రద్దీ



క్యూలైన్‌లో సర్వదర్శన భక్తులు

తిరుమల, మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం సాయంత్రం పెరిగిన భక్తుల రద్దీ.. శుక్రవారమూ కొనసాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లు కాస్తా ఖాళీగానే కనిపించినప్పటికీ శని, ఆదివారాలు వరుస సెలవులు ఉండటంతో శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. వీరికి 17 గంటల దర్శన సమయం పడుతోంది. ఇక, స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మూడుగంటల తర్వాత దర్శనం లభిస్తోంది. రద్దీ పెరిగిన క్రమంలో శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, లడ్డూకౌంటర్, అఖిలాండం, అన్నప్రసాద భవనం, సీఆర్వో, లేపాక్షి సర్కిల్, రాంభగీచ వంటి ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. శని, ఆదివారాల్లోనూ ఈ రద్దీ కొనసాగే అవకాశముంది.

ఎర్రచందనం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ శుక్రవారం ఎర్రచందనం కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. అటవీశాఖ బీట్ అధికారి రాజేష్ తెలిపిన ప్రకారం.. కడప జిల్లా మాధవరానికి చెందిన రమేటి సుబ్బరాజు, వెంకటాపురం గ్రామానికి చెందిన గంపల యల్లయ్య 2019లో సిద్దవటం రేంజ్ పరిధిలోని ముతుకూరు బీట్‌లో రెండు ఎర్రచందనం దుంగలను తరలించడానికి సిద్ధంగా ఉంచారు. అప్పటి బీట్ అధికారి హైమావతి దేవి, రేంజర్ ప్రసాద్ వారిని పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి.. ఒక్కో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో లైజన్ అధికారులుగా రాజేష్, శ్రీనివాస్ వ్యవహరించారు. కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాలకృష్ణమనాయుడు వాదనలు వినిపించారు.

'ఎర్ర' స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి, మే 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణి(35)పై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం ఆమోదించింది. తిరువణ్ణామలై జిల్లా జమునమత్తూరు తాలూకా నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి తరచూ ఎర్రావారిపాలెం మండల పరిసరాల్లోని అడవుల్లో ఎర్రచందనం చెట్లు నరికి దుంగలు అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసు, టాస్క్‌ఫోర్స్ రికార్డులు చెబుతున్నాయి. ఇతడిపై పలు కేసులు నమోదవడంతో పాటు ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నాడు. ఇతడిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తూ కలెక్టర్ మార్చి 22న ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై గత నెల 16వ తేదీన అడ్వైజరీ బోర్డు నిందితుడిని, దర్యాప్తు అధికారులను విచారించింది. నిందితుడి నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న బోర్డు పీడీ యాక్టును సమర్థిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో కలెక్టర్ నిర్ణయాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

అజ్ఞాతంలోకి 'ఎర్ర' దొంగలు

● పూచీకత్తు ఇచ్చిన ఇద్దరికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మే 2(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం కేసులో ఇద్దరి పూచీకత్తుతో ఐదుగురు నిందితులు జైలు నుంచి విడుదలయ్యారు. వీరిలో ఒకరు చనిపోగా, మిగిలిన నలుగురు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో పూచీకత్తుదారులకు భారీ జరిమానా విధిస్తూ ఎర్రచందనం కోర్టు జిల్లా ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. అటవీశాఖ అధికారి కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా పెరియవళ్లి గ్రామానికి చెందిన ఎ.రమేష్, కుమార్, డి.చిన్నస్వామి, సుధాకర్, ఏలుమలై.. చిత్తూరు జిల్లా ఐరాల పరిధిలో ఎర్రచందనం దుంగలు అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఐదేళ్ల కిందట ఐరాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల తర్వాత వీరికి పీలేరుకు చెందిన జి.శేషాద్రి నాయుడు, ప్రసాద్ ష్యూరిటీ ఇచ్చి బెయిల్‌పై విడుదల చేయించారు. బెయిల్‌పై విడుదలైన ఐదుగురిలో ఎ.సుధాకర్ మృతి చెందాడు. మరో నలుగురికి న్యాయమూర్తి నాన్ బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్టు చేసి తీసుకురావాలని పోలీసులను ఆదేశించారు. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోవడంతో సొంత పూచీకత్తుపై విడుదల చేయించిన ఇద్దరికి.. ఒక్కో నిందితుడికి రూ.20 వేల చొప్పున జరిమానా చెల్లించాలంటూ శుక్రవారం న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు.

తొలిరోజే 'విద్యార్థి మిత్ర'

● పాఠశాలల ప్రారంభం నాడే పిల్లలకు కిట్లు అందజేత

● జిల్లాకు చేరిన విద్యాసామగ్రి

నెల్లూరు(విద్య), మే 2 (ఆంధ్రజ్యోతి) : ఈ విద్యా సంవత్సరం (2025-26)లో పాఠ శాల ప్రారంభించిన తొలిరోజే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఏకరూపదుస్తులతో పాటు విద్యాసామగ్రి అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలోని పాఠశాలలకు అవసరమైన సామగ్రిని భద్రపరిచేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేక పర్యవేక్షణలో అన్నీ తరగతులకు 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో విద్యాసామగ్రి పంపిణీకి కిట్లను సిద్ధం చేస్తున్నారు.

● కమిటీల ఏర్పాటు

ప్రభుత్వ పాఠశాలలు తెరిచేనాటికి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయాలన్న లక్ష్యంతో సమగ్రశిక్ష ద్వారా అధికారులతో మండల, జిల్లాస్థాయి కమిటీలను నియమించారు. 1 నుంచి 10వ తరగతి వరకు ప్రతి విద్యార్థికి పాఠ్యపుస్త కాలు, నోటుపుస్తకాలు, స్కూల్‌బ్యాగు, 3 జతల యూనిఫాం క్లాత్, బెల్టు, ఒక జత షూ, రెండుజతల సాక్సులు, డిక్షనరీ, వర్క్‌బుక్స్ అందజేయనున్నారు. ఈ కిట్ల ప్రకారం జిల్లాకు 1,61,959 స్కూలు బ్యాగులు, 1,15,480 బెల్టులు, 1,61,959 యూనిఫాంలు, 1,64,721 షూలు, 8,74,740 నోటుపుస్తకాలు, 1,30,870 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు జిల్లాకు ఇప్పటికే కొన్ని చేరిపోగా, మిగిలినవి కూడా చేరుతున్నాయి.

● ప్రత్యేక పర్యవేక్షణ

ప్రతి విద్యార్థికి విద్యాకిట్లు అందేలా ప్రత్యేక పర్యవేక్షణకు కమిటీలు ఏర్పాట య్యాయి. జిల్లాస్థాయి కమిటీలో హెడ్‌గా సమగ్రశిక్ష ఏపీసీ వ్యవహరిస్తుండగా, కన్వీనర్‌గా సీఎంవో, సభ్యులుగా జీసీడీవో, ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఏఎల్‌ఎస్ కోఆర్డినేటర్ నియమితులయ్యారు. వీరంతా జిల్లా, మండల స్థాయిల్లో స్టాక్ పాయింట్లను గుర్తించి వచ్చిన వస్తువుల నాణ్యతను పర్యవేక్షించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తారు. అలాగే మండల స్థాయి కమిటీలో హెడ్‌గా ఎంఈవో, సభ్యులుగా నలుగురు ఇంజనీరింగ్ సిబ్బంది, ఎంఐఎస్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సీఆర్‌ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు పనిచేస్తూ కిట్లను మండల స్టాక్ పాయింట్లలో భద్రపరిచి స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటారు. ట్రాన్స్‌పోర్టు ద్వారా పాఠశాలలకు కిట్లు చేరవేస్తారు. అనంతరం ఎంఈవో బయోమెట్రిక్ విధానం ద్వారా కిట్లను అందచేస్తారు. అలాగే పాఠశాల కమిటీలో ప్రధానోపాధ్యాయులు, గ్రామసచివాలయం ఎడ్యుకేషన్ అసిస్టెంట్, మహిళాపోలీస్, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు సమక్షంలో విద్యార్థి కిట్లు పంపిణీ చేయాలి. విద్యార్థులతో బయోమెట్రిక్ వేయించి రోజువారి రిపోర్టులను ఎంఈవో, ఇతర అధికారులకు పంపుతారు.



జిల్లాకు చేరిన విద్యార్థి మిత్ర కిట్లు

అందరికీ అందజేస్తాం



పాఠశాల ప్రారంభమైన తొలిరోజే ప్రతి విద్యార్థికి కచ్చితంగా విద్యామిత్ర కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. వీటి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీలు విద్యార్థి పూర్తి వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు ఒక్క విద్యార్థికి కూడా పెండింగ్ లేకుండా అందిస్తాం. జిల్లాకు వస్తున్న కిట్లలో ఒక్కటి కూడా తగ్గకుండా చూసుకుంటూ, నాణ్యతను పరిశీలించి స్టాక్ పాయింట్లలో భద్రపరుస్తున్నాం. పాఠశాలల వారీగా విభజించి జూన్ 12న విద్యార్థులందరికీ అందచేయనున్నాం.

- వెంకటసుబ్బయ్య, సమగ్రశిక్ష ఏపీసీ

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి


నెల్లూరు (హరనాధపురం) మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పీబీకే పరిమళ ప్రకటనలో కోరారు. గురుకులాల్లో 3, 4వ తరగతి నుంచి 9వతరగతి వరకు 192 సీట్లు మిగిలి ఉన్నట్లు తెలిపారు. కొడవలూరు, కావలి, సర్వేపల్లి, బీఆర్‌పాలెం, ఇందుకూరుపేట, కరేడు, నెల్లూరు, రాపూరులలో ఈ ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని, 30న ఐటీడీఏ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా సీట్ల భర్తీ చేయనున్నట్లు తెలిపారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● 16 రహదారుల అభివృద్ధికి రూ.24.72 కోట్లు

● 38.87 కి.మీ కొత్త రోడ్లకు అనుమతులు

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధానమైన లింకు రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రూరల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఆర్‌ఐడీఎఫ్) కింద ఈ రోడ్లను బాగు చేసేందుకు అనుమతులు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 557.22 కోట్లతో 402 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లాలో 16 రోడ్లు అభివృద్ధి కానున్నాయి. 38.87 కిలోమీటర్ల మేర కొత్తగా బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఇందుకుగానూ రూ.24.72 కోట్లను కేటాయించారు. కొన్ని ప్రధానమైన లింకు రోడ్లు చాలా కాలం క్రితం వేసినవి కావడంతో దెబ్బతిన్నాయి. గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఇటువంటి వాటిని గుర్తించిన పంచాయతీ రాజ్ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ఆ వివరాలు పంపారు. ఈ క్రమంలో ఆర్‌ఐడీఎఫ్ నిధులతో ఈ ఏడాది చేపట్టనున్న రోడ్ల జాబితాలో 16 రోడ్లు చోటు దక్కించుకున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెలలోనే టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి వర్షాకాలంలోపు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈ అశోక్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులతో జిల్లాలో 16 ప్రధానమైన రోడ్లను పునఃనిర్మించనున్నట్లు చెప్పారు. టెండర్ ప్రక్రియకు సంబంధించి శనివారం ప్రకటన విడుదల చేస్తామని, ఆ వెంటనే ఎస్టిమేషన్లు పూర్తి చేసి టెండర్లు పూర్తి చేస్తామని వివరించారు.



సోమశిల నుంచి డెల్టా ప్రాంతానికి విడుదలైన నీరు

సోమశిల నుంచి డెల్టాకు నీరు విడుదల

అనంతసాగరం, మే 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లావాసుల తాగునీటి అవసరాల కోసం సోమశిల జలాశయం నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారు. డ్యాంలోని 6వ నెంబరు క్రస్ట్‌గేటు ద్వారా డెల్టా ప్రాంతానికి 1,000 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కాగా జలాశయంలో 51.114 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 30, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● రాళ్లపాడు నుంచి..

లింగసముద్రం : పత్తి సాగు కోసం రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీటిని అధికారులు విడుదల చేశారు. ప్రాజెక్టు డీఈలు ఎం వెంకటేశ్వర్లు, మధుసూదనరావు, ఏఈ జి చంద్రమౌళిలు తమ సిబ్బంది ద్వారా కుడి కాలువకు 60 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 8 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని డీఈ వెంకటేశ్వర్లు రైతులను కోరారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు.

గ్రామీణ బ్యాంకుల విలీనం

● ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్పు

ఉదయగిరి రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల ప్రజలకు ఏళ్ల తరబడి సుపరిచితమైన గ్రామీణ బ్యాంకులు విలీనం అయ్యాయి. ఆంధ్రప్రగతి గ్రామీణ, వికాస్, సప్తగిరి గ్రామీణ, చైతన్య గోదావరి బ్యాంకులు ఇకపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చుకుని ఖాతాదారులకు సేవలు అందించనున్నాయి. ఇందులో భాగంగా జిల్లాలోని 86 ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులు కూడా అదే తరహాలో ఖాతాదారులకు సేవలు అందిస్తాయి. మొట్టమొదటగా 1976లో గ్రామీణ ప్రజలకు అందుబాటు ఉండేలా పినాకిని గ్రామీణ బ్యాంకు ప్రారంభమైంది. కాలక్రమేణా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చుకొని ఏళ్ల తరబడి సేవలు అందిస్తూ వచ్చేది. ప్రస్తుతం ఆ బ్యాంకు ముచ్చటగా మూడవసారి పేరు మార్చుకుని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు చెందింది. కాగా ఖాతాదారులు ఎలాంటి ఆందోళనలకు గురి కాకుండా, యథావిధిగా సేవలు పొందాలని సంబంధిత అధికారులు తెలిపారు.

టిడ్కో లబ్ధిదారుల సమస్యలు పరిష్కరిస్తా

● రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : నగర శివార్లలోని అక్కచెరువుపాడు వద్దనున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్ర వారం టిడ్కో సము దాయం వద్దకు వెళ్లిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. తాగు నీరు, లైట్లు, పారిశుధ్యం, డ్రైనేజీ వంటి సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు తీసుకో వాలని ఆదేశించారు.

కిలో పొగాకు రూ.280

కలిగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 397 బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 301 బేళ్ల కొ నుగోలు చేశారు. నోబిడ్-73, ఆర్‌ఆర్-2, సీ ఆర్-18, జంపింగ్‌లాట్స్-3 కారణాలతో 96 బే ళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.210, సగటు ధర రూ.250.11గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు మధ్యలో కుర్చీ



రోడ్డుకు మధ్యలో గుంటకు అడ్డంగా ఏర్పాటు చేసిన కుర్చీ

నెల్లూరు (క్రైం), మే 2 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నవాబుపేట టీవీఎస్ స్కూలు సమీపంలో రోడ్డుపై ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. నగరం నుంచి నవాబుపేట, రాజుపాలెం, నరుకూరు, ఇందుకూరుపేట ప్రాంతాల వైపు నిత్యం వేలాది మంది వాహనాల్లో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు మధ్యలో గుంట ఉండటంతో వేగంగా వస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోజుల తరబడి ఇలాగే ఉన్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికంగా ఉన్న దుకాణదారులు రోడ్డుపై గుంత వద్ద కుర్చీని గుర్తుగా ఏర్పాటు చేశారు. వాహనదారుల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేశారు. అయితే గుంత విషయం తెలియని వారు 'ఇదేందయ్యా! రోడ్డు మధ్యలో కుర్చీవేశారు' అనుకుంటూ ముందుకు సాగుతున్నారు.

పంట కాలువలను ఆక్రమిస్తే ఉపేక్షించొద్దు

● కమిషనర్ నందన్



పంట కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ వ్యవస్థకు ఆటంకం కలిగించే విధంగా పంట కాలువలను ఆక్రమిస్తే ఉపేక్షించవద్దని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. శుక్రవారం 30వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. కాలువలను ఆక్రమిస్తే సిటీప్లానింగ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డైకస్‌రోడ్డులోని అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను పరిశీలించారు. కార్పొరేషన్ ఖాళీ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మించాలని ఆదేశించారు. ఆ తర్వాత కార్యాలయంలో వివిధ విభాగాల అధిపతులు, జూనియర్, సీనియర్ సహాయకులతో సమావేశం నిర్వహించి పలు సూచన చేశారు.

మా గ్రామం వద్ద చెత్త పోయొద్దు

వీఎంఆర్ కాలనీ గిరిజనుల నిరసన



సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి రోడ్డుపై నిరసన తెలుపుతున్న వీఎంఆర్ గిరిజన కాలనీవాసులు

సూళ్లూరుపేట, మే 2(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని చెత్తను తెచ్చి తమ గ్రామ సమీపంలో పోయొద్దని కొణ్ణంబట్టు సమీపంలో ఉన్న వీఎంఆర్ గిరిజన కాలనీవాసులు స్పష్టం చేశారు. శుక్రవారం చెత్త తరలిస్తున్న మున్సిపల్ ట్రాక్టర్లను అడ్డుకొని సూళ్లూరుపేట - శ్రీకాళహస్తి రోడ్డుపై నిరసనకు దిగారు. సూళ్లూరుపేట డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి అదుపులోకి రాకపోవడంతో మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో చెత్తంతా కొణ్ణంబట్టు సమీపంలోని జగనన్న లే అవుట్ ఎదురుగా ఉన్న భూముల్లో పోస్తున్నారు. శుక్రవారం రెండు ట్రాక్టర్లు చెత్తను తీసుకెళ్లి పోస్తుండగా సమీపంలో ఉన్న వీఎంఆర్ గిరిజన సెంటర్ వాసులు అడ్డుకొని ఇక్కడ చెత్తను పోయద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం రోడ్డుపైకి చేరుకొని నిరసన తెలిపారు. జనావాసాలు ఉన్న చోట చెత్తపోసి డంపింగ్ యార్డులా మార్చవద్దని అన్నారు. అక్కడున్న స్థానికులు కొందరు సర్దిచెప్పి రోడ్డుపై నిరసన చేపట్టవద్దని, మున్సిపల్ అధికారులతో మాట్లాడుకోవాలని సర్దిచెప్పి పంపించేశారు. దీనిపై మున్సిపాలిటీ కమిషనర్ చిన్నయ్యను వివరణ కోరగా డంపింగ్ యార్డులో మంటలు అదుపులోకి రాలేదని, అందువల్ల తాత్కలికంగా చెత్తను జగనన్న లే అవుట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం పోస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆ చెత్తను తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తామని చెప్పారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ చేతివాటం

రూ.1.50లక్షలు స్వాహా

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ చేతివాటం చూపి రూ.1.50లక్షల పెన్షన్ నగదు స్వాహా చేశాడు. దీంతో అతడి కుటుంబ సభ్యుల నుంచి రికవరీ చేసి ఆ నగదును డీఆర్‌డీఏకు పంపారు. ఏప్రిల్ మాసానికి సంబంధించి కేశవరం పంచాయతీ పరిధిలో 410మందికి పెన్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇందుకోసం రూ.19లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. పెన్షన్ల పంపిణీ అనంతరం ఇంటి వద్ద లేనివారు, చనిపోయిన వారికి సంబంధించి సుమారు రూ.1.50లక్షలు మిగిలింది. ఆ సొమ్మును సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు వెల్ఫేర్ అసిస్టెంట్‌కు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఆ నగదును డీఆర్‌డీఏ కార్యాలయానికి చేర్చాల్సి ఉండగా, అలా చేయలేదు. దీనిపై వెల్ఫేర్ అసిస్టెంట్‌ను పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్‌డీ నిలదీసినప్పటికీ సమాధానం దాటవేస్తూ వచ్చాడు. శుక్రవారం టీడీపీ నేత చాపల శ్రీనివాసులుతో పాటు పలువురు నాయకులు వెల్ఫేర్ అసిస్టెంట్‌ను నిలదీయడంతో ఆ నగదును తానే వాడుకున్నానని చెప్పాడు. దీంతో ఉద్యోగం పోతుందన్న భయంతో వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబసభ్యులు ఆఘమేఘాలపై నగదు సమీకరించి టీడీపీ నాయకుల ద్వారా సచివాలయంలో అప్పగించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కాగా, మే నెలలో కూడా 37మందికి పెన్షన్ ఇవ్వలేదని సమాచారం.

కిశోరి వికాసంపై అవగాహన కల్పించాలి



కార్యక్రమంలో ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి

గూడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసంపై బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీవో స్వరూపారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం - వేసవి సెలవులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కిశోరి వికాసం పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కిశోర బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యాలు, క్రీడలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాలతో వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేలా ఈ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ఈనెల 2నుంచి జూన్ 10వ తేదీ వరకు రోజుకు ఒక అంశంపై బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హైమావతి, చెంచులక్ష్మి, బుజ్జమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న డీఎస్పీ గీతా కుమారి

గూడూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా జీవించాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయ ఆవరణలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పరిసరాల అపరిశుభ్రత కారణంగా అంటు వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పర్యావర్ణాన్ని కాపాడుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని, ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో మంటలు

కాలిపోయిన దేవుడి చిత్రపటాలు

చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్యపల్లె హరిజనవాడ శ్రీకృష్ణ ఆలయ గర్భగుడిలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు గమనించి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆలయంలోని దేవుడి చిత్రపటాలు కాలిపోయాయి. చంద్రగిరి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆలయాన్ని పరిశీలించారు. దీపం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తుండగా ఇది గుర్తు తెలియని వ్యక్తుల పని అని గ్రామస్తులు అనుమానిస్తున్నారు.

ప్రయాణికులకు పటిష్ఠ భద్రత కల్పిస్తాం

తిరుపతి(సెంట్రల్), మే 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుమలకు వస్తున్న ప్రయాణికులకు పటిష్ఠ భద్రత కల్పిస్తున్నామని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) తిరుపతి ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్, ప్రభుత్వ రైల్వే పోలీస్ సీఐ ఆశీర్వాదం తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్లాట్‌ఫారాల్లో అనుమానిత బ్యాగులను తనిఖీ చేశారు. విశ్రాంతి గదులు, దుకాణాలు, క్లాక్ రూమ్‌లను పరిశీలించారు. కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో తనిఖీలు చేసినట్లు చెప్పారు. రైళ్లలో వరుస దోపిడీలను నివారించడానికి ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

7న పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

గూడూరు అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఈనెల 7వ తేదీన చెన్నైకు చెందిన టీవీఎస్ సుందరం క్లైటాన్ కంపెనీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవికృష్ణ, సివిల్ హెచ్‌వోడీ వీరనారాయణ తెలిపారు. 18 నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. ఇంటర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9912342017, 9989085540 నంబర్లను సంప్రదించాలన్నారు.

శంకరాచార్యులకు ప్రత్యేక అలంకరణ



వెంకటగిరి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కర్ణకమ్మవీధిలో వెలసిన శంకరాచార్యుల మఠంలో ఆయన జయంతిని పురష్కరించుకుని శుక్రవారం ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి మఠం నిర్వాహకులతో పాటు పిల్లలు నృత్యాలు, భజనలు చేశారు. అన్నదానం చేశారు.



నిరుపయోగంగా ఉన్న కాట్రగుంట సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యకేంద్రం భవనాలు

ప్రారంభానికి నోచుకోని ప్రభుత్వ భవనాలు

బాలాయపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని కాట్రగుంట పంచాయతీలో పలు ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కేంద్రాల కోసం కాట్రగుంట పంచాయతీలో నూతన భవనాల నిర్మాణం చేపట్టారు. సచివాలయ భవనం కోసం రూ.40 లక్షలు, ఆరోగ్య కేంద్రం రూ.20.80 లక్షలు, రైతు భరోసా కేంద్రం కోసం 23.94 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. 2021లో పనులు ప్రారంభించి 2023లో నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే ఆయా భవనాలకు ఇప్పటి వరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ఆ భవనాలను ప్రారంభించక నిరుపయోగంగా ఉన్నాయి. ఇక పంచాయతీ కార్యాలయ భవనంలో సచివాలయం, ఆరోగ్య కేంద్రం, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఒకే భవనంలో ఇరుకు గదుల్లో నిర్వహిస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రం భవనాలకు విద్యుత్ సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ధర్మరాజస్వామి ఉత్సవాలు



స్వామివారి దర్శనానికి విచ్చేస్తున్న సినీ నటుడు అజయ్ ఘోష్ - బియ్యం బస్తాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ సతీమణి కోమలి, పెంచలకోన ఆలయ మాజీ చైర్మన్ నానాజీ తదితరులు

తడ, మే 2(ఆంధ్రజ్యోతి) తడ మండలం వాటంబేడు కుప్పంలోని పంచపాండవ ద్రౌపది సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్నాహ్నం మహాభారత కావ్యం నాటక ప్రదర్శన జరిగింది. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుష్పాలతో అలంకరింపజేసి గ్రామోత్సవం నిర్వహించారు. సినీ నటుడు, పుష్ప సినీ ఫేమ్ అజయ్ ఘోష్ స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నై యుగంధర్ విశ్వరాగం ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో పాటకచ్చేరి నిర్వహించారు. సినీ నటుడు అజయ్ ఘోష్ మాటల గారడితో జనాలను ఉర్రూతలూగించారు. టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ 400 బస్తాల బియ్యాన్ని గ్రామస్తులకు అందజేశారు. ఆ బియ్యం బస్తాలను గంగాప్రసాద్ సతీమణి కోమలి, పెంచలకోన ఆలయ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ గ్రామస్తులకు పంచిపెట్టారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వారిని పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, బొమ్మన్ పళణి, మాధవనాయుడు, శ్రీధర్, జయరామయ్య, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకుంటే తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు అన్నారు. మండల పరిధిలోని గూడలి పంచాయతీ చంద్రశేఖరపురంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు, రైతుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటలు, నవధాన్యాల సాగువల్ల కలిగే ఉపయోగాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రతి రైతూ కనీసం అర ఎకరంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ శ్రీకాంత్, మోడల్ మేకర్ శ్రీనివాసులు, మండల ఇన్‌చార్జ్ పద్మ, రాజ్యాలక్ష్మి, వీఓఏ మునెమ్మ, భానుకుమారి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు, రైతులు

బాల్య వివాహాలను అరికట్టాలి



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కౌన్సెలర్ నారాయణ

వెంకటగిరి టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు అరికట్టేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని 4వ వార్డు కౌన్సెలర్ ఎంవీ నారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక కుమ్మరిమిట్ట అంగన్‌వాడీ కేంద్రం స్కూల్‌లో చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల్లో బాల్య వివాహాల దురాచారం ఎక్కువగా ఉందన్నారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్ల వయస్సు నిండిన తరువాతనే వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో శ్రీనివాసులు, మహిళా పోలీస్ వరలక్ష్మి, మలీశ్వరి, లక్ష్మీకాంతమ్మ, బీనా తదితరులు పాల్గొన్నారు.

కాళంగి నదిలో స్నానానికి వెళ్లి సేలంవాసి మృతి

సూళ్లూరుపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలోని కాళంగి నదిలో మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. పోలీసుల సమాచారం మేరకు.... తమిళనాడు సేలం ప్రాంతానికి చెందిన చిన్నుస్వామి(50) భార్య హంసవేణితో కలిసి కొన్నాళ్లుగా సూళ్లూరుపేటలోనే చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కాళంగి నదిలో స్నానాకి దిగి నీట మునిగిపోయాడు. సమీపంలో ఉన్న గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పెళ్లకూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలని టీడీపీ కార్యకర్తలకు ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య సూచించారు. శుక్రవారం కొత్తూరులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, ప్రధాని మోదీ చేతుల మీదుగా రాజధాని అమరావతి పునఃనిర్మాణానికి శంకుస్థాపన చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, నాయకులు సిద్దులయ్య నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు

తిరుచానూరు, మే 2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా జస్టిస్ ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు అమ్మవారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

కాలువ భూమిలో ఆక్రమణల తొలగింపు

తిరుపతి రూరల్, మే2(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పైడిపల్లె సర్వే నంబరు 195/1లోని కాలువ పొరంబోకు స్థలాన్ని కలిపేసుకుని వైసీపీ నేత ఏర్పాటు చేసిన దారిని శుక్రవారం రెవెన్యూ అధికారులు ఎక్సకవేటర్ సాయంతో తొలగించారు. కాలువ గట్టుపై గ్రావెల్ పరచి ఏర్పాటు చేసిన దారిని చదును చేశారు. ఆర్ఐ రఘువర్మ, వీఆర్వో మురళి, వీఆర్ఏ పాల్గొన్నారు.

ఆదర్శ దంపతులు సీతారాములు

వివాహం దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణలో వక్తలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణమూర్తి, రఘురాం, మేడసాని మోహన్, దక్షిణామూర్తిశర్మ, పీవీ రెడ్డి, ఆముదాల మురళి, గంగవరం శ్రీదేవి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 2 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో ఆదర్శ దంపతులుగా సీతారాములు నిలిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త గంగవరం శ్రీదేవి సంపాదకత్వం వహించిన 'వివాహం దివ్యత్వ సాధనం' పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతిలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. సంస్కృత యూనివర్సిటీ - శ్రీరామకృష్ణ సేవా సమాజం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని సంస్కృత వర్సిటీలోని చెలికాని అన్నారావు హాల్లో నిర్వహించారు. సభాధ్యక్షత వహించిన సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సీతారాముల దాంపత్యాన్ని ఉత్తరామ చరితంలో భవభూతి కొనియాడారని తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రత్యేకాధికారి శ్రీరామ్ రఘురాం మాట్లాడుతూ నేటి సామాజిక పరిస్థితుల్లో దాంపత్య జీవితానికి ఆదర్శ మార్గాన్ని ఈ పుస్తకం నిర్దేశిస్తుందని చెప్పారు. అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి మేడసాని మోహన్ మాట్లాడుతూ స్త్రీ, పురుషుల మధ్య పవిత్ర ప్రణయ అనుబంధమే దాంపత్యమని అభిప్రాయపడ్డారు. సంస్కృత వర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తిశర్మ, రామకృష్ణ మిషన్ తిరుపతి శాఖ అధ్యక్షులు పీవీ రెడ్డి మాట్లాడుతూ మన దేశంలోని దాంపత్య విధానం ప్రపంచంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అవధాని ఆముదాల మురళి పుస్తక సమీక్ష చేశారు. పుస్తక సంపాదకులు గంగవరం శ్రీదేవి మాట్లాడుతూ పతనమవుతున్న దాంపత్య జీవిత విలువలను పెంపొందించే లక్ష్యంతో ఈ పుస్తకాన్ని వెలువరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ మోహన మునిసిద్ధారెడ్డి, తెలుగు అధ్యాపకులు నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఆధ్యాత్మిక, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అబార్షన్ అయ్యి ఆస్పత్రికి..

వైద్యం అందక గర్భిణి అవస్థలు

స్థానిక మహిళల సపర్యలతో తప్పిన ప్రమాదం

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మూడు నెలల గర్భిణికి అబార్షన్ అవడంతో ప్రభుత్వాస్పత్రికి వెళ్తే వైద్యం అందక ఆ మహిళ పడరాని పాట్లు పడింది. చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వాస్పత్రుల్లో కూడా గైనకాలజిస్టులు లేకపోవడంతో స్థానిక మహిళలే సమర్యలు చేయడంతో కోలుకుంది. కోట మండలంలోని చెందోడు పంచాయతీ నీలగిరి సంఘం గిరిజన కాలనీకి చెందిన మహిళ మూడు నెలలు గర్భిణి. శుక్రవారం ఆమెకు ఉనసరరన ఓవర్ బ్లీడింగ్ కావడంతో కుటుంబ సభ్యులు కోటలోని 30 పడకల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ గైనకాలజిస్ట్ దీర్ఘకాలిక మెడికల్ సెలవులో ఉందని ఇతర వైద్యులు చెప్పారు. దీంతో దిక్కుతోచని ఆ గిరిజన కుటుంబం వాకాడు ప్రభుత్వాస్పత్రికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. అక్కడ కూడా గైనకాలజిస్ట్ మెడికల్ లీవ్‌లో ఉందని తెలియడంతో చిట్టేడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చూపించుకోవాలనుకున్నారు. అయితే అక్కడా గైనకాలజిస్ట్ లేకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచక బాధితురాలి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇంతలో స్థానిక మహిళలు చొరవ తీసుకుని గర్భిణికి అబార్షన్ అయిందని గుర్తించి సపర్యలు చేయడంతో ప్రాణాపాయం నుంచి బయట పడింది.

ఈతకెళ్లి బాలుడి మృతి



అరవింద్ (ఫైల్‌ఫొటో)

కోట, మే 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని రామవపురం గ్రామానికి చెందిన గోనుపల్లి అరవింద్ (14) ఈత కొట్టేందుకు వెళ్లి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, లక్ష్మమ్మ కుమారుడు అరవింద్ బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి ఊరి పొలిమేరల్లో ఉన్న బావిలోకి ఈత కొట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో అరవింద్‌తో అందరూ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. 6 గంటల సమయంలో అరవింద్ మళ్లీ ఈత కొట్టేందుకు వెళ్లి బావిలో దిగాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పొలాల్లో ఉన్న బావుల వద్ద గాలించారు. చుట్టుపక్కల గ్రామాల్లోనూ విచారించినా అరవింద్ ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం తెల్లవారుజామున గ్రామ పొలిమేరల్లో ఉన్న బావిలో మృతదేహం తేలియాడుతుండడాన్ని స్థానికులు గుర్తించి బయటకు తీశారు. ఆడుతూ పాడుతూ సరదాగా ఉండే అరవింద్ చనిపోవడంతో తల్లిదండ్రులతో పాటు బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

వివాహితను వేధించిన కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), మే 2 (ఆంధ్రజ్యోతి): వివాహితను వేధించి, బెదిరించిన కేసులో నిందితుడు చంద్రమౌళిని తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ కుమ్మరపల్లి గ్రామంలో నివాసముంటున్న వివాహితను చంద్రమౌళి గతంలో బెదిరించి, వేధించేవాడు. దీనిపై గురువారం అందిన ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చిన్నగోవిందు చెప్పారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

భాకరాపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల గ్రామ పంచాయతీ తుమ్మచేను పల్లెకు చెందిన సింగం చంద్రారెడ్డి ఆవు పిడుగు పాటుకు మృతి చెందింది. శుక్రవారం మధ్యాహ్నం పొలం వద్ద మేస్తుండగా ఉరు ములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అప్పుడు పిడుగు పడి ఆవు మృతి చెందింది. ఆవు రోజుకు 20 లీటర్ల పాలు ఇచ్చేదని, సుమారు రూ.లక్ష విలువ జేస్తుందని రైతు తెలిపారు. కుటుంబానికి జీవనాధారమైన ఆవు మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 9మందికి జరిమానా

తిరుపతి (నేర విభాగం), మే 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిని తిరుపతి నాలుగవ అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ ఎదుట శుక్రవారం హాజరుపరిచారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.